RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



04 మే 2025 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:287

## సన్న బియ్యం లబ్ధిదారుడు ఇంట్లో భోజనం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్..

**హిమాయత్ నగర్ ఆదర్శ బస్తీలో పౌరసరఫరాల దుకాణం 602 లో లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేసిన హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్..**





**ఖైరాతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** నారాయణ గూడ గాంధీ కుటీర్ వద్ద సన్న బియ్యం లబ్ధిదారుడు ఇంట్లో భోజనం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్,మేయర్ గద్వాల విజయ లక్ష్మీ ,కలెక్టర్ అనుదీప్ దురశెట్టి,కార్పొరేటర్లు మహా లక్ష్మి,విజయారెడ్డి

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ

భారతదేశంలో మొదటి సారి ధనవంతుడు పేదవాడు అనే తేడా లేకుండా సన్న బియ్యం తినాలని తెలంగాణ ప్రభుత్వం ఉగాది పండగ నుండి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించింది.

హైదరాబాద్ లో ఎన్నికల కోడ్ వల్ల సన్న బియ్యం పంపిణీ చేయలేకపోయింది

ఈ నెల ఒకటో తేదీ నుండి 653 రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ ప్రారంభించింది

సన్న బియ్యం కార్యక్రమంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఈ బియ్యం పంపిణీ చేస్తున్నాం

అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నాం

10 సంవత్సరాలుగా రేషన్ కార్డులు ఇవ్వలేరు..మార్పులు చేయలేదు

తెలంగాణ ప్రభుత్వం కుల గణన సర్వే ,ప్రజా వాణి అప్లికేషన్ , రెగ్యులర్ గా ఎమ్మార్వో ఆఫీస్ ల నుండి వచ్చిన అప్లికేషన్ ల ద్వారా రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ జరుగుతుంది

ఇది చారిత్రాత్మక నిర్ణయం.. బయట 60 రూపాయలకు కేజీ బియ్యం ఉన్నాయి

ఈ పథకం ఎంతగానో ఉపయోగపడనుంది

తెలంగాణ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 500 కి గ్యాస్,సన్న వడ్లకు 500 బోనస్,60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం

హైదరాబాద్ సమగ్ర అభివృద్ధిపై ముందుకు వెళ్తాం

హైదరాబాద్ ప్రజలు ఈ సన్న బియ్యం పథకాన్ని ఉపయోగించుకొని ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించగలరు..

ఇందిరమ్మ ఇళ్లు , రేషన్ కార్డులు ,

యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం..

నారాయణ గూడ గాంధీ కుటీర్ వద్ద సన్న బియ్యం లబ్ధిదారుడు ఇంట్లో స్థానిక ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్లు అధికారులతో కలిసి భోజనం చేయడం జరిగింది

సన్న బియ్యం లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు..

## జిహెచ్ఎంసి సర్కిల్ -14 ఉద్యోగులపై దాడి చేసిన బిజెపి కార్పొరేటర్...

**కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పై బిఎన్ఎస్ యాక్ట్ 132 , 352 కింద కేసు నమోదు**





**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**జీహెచ్ఎంసి గోషామహల్ సర్కిల్ -14లో ఉద్యోగులపై దాడికి పాల్పడిన జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పై క్రిమినల్ చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా శనివారం అబిడ్స్ లోని సర్కిల్ -14కార్యాలయానికి తాళాలు వేసి , కార్యాలయంలో బైటాయించిన ఉద్యోగులు తమ నిరసనను వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం సమయంలో కార్యాలయంలో విధుల్లో ఉన్న తనపై , చైన్ మెన్ అరిఫ్ పై అకారణంగా కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ దాడికి పాల్పడ్డారని సెక్షన్ ఆఫీసర్ నరేష్ తెలిపారు. ఎందుకు దాడి చేశారని టౌన్ ప్లానింగ్ ఏసీపీ మంజుల సింగ్ కార్పొరేటర్ ను ప్రశ్నిస్తే , ఆమెను కూడా అసభ్య పదజాలంతో దూషించారని అన్నారు. గత కొంత కాలంగా సొంత పనుల కోసం కార్పొరేటర్ తమపై ఒత్తిడి చేస్తున్నారని.ఆయన చెప్పినట్లు వినకపోవడం వల్లే దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. కార్పొరేటర్ ను వెంటనే అరెస్టు చేయాలని సర్కిల్ -14 ఉద్యోగులు విధులు భహిష్కరించి బైటాయించినారు. పెద్దఎత్తున నినాదాలు చేశారు. తమకు రక్షణ లేకపోతే , విధులు ఎలా నిర్వహించాలని ప్రశ్నించారు. అనంతరం ఏసీపీ మంజుల సింగ్ ఆధ్వర్యంలో అబిడ్స్ పోలీస్ స్టేషన్ లో రాకేష్ జైస్వాల్ పై ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు రాకేష్ జైస్వాల్ పై బిఎన్ఎస్ యాక్ట్ 132 , 352 కింద కేసు నమోదు చేశారున్ ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించి , దాడికి పాల్పడ్డారని అబిడ్స్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.ఇట్టి విషయమై ఉన్నతాధికారుల ద్వారా జీహెచ్ఎంసీ కమీషనర్ కర్ణన్ దృష్టికి తీసుకెళ్ళారు.

## ప్రభాకర్ అనే లబ్ధిదారుని ఇంట్లో వారి కుటుంబంతో కలిసి భోజనం చేసిన

### రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కూమార్ యాదవ్



**ముషీరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని పలు రేషన్ దుకాణాలలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేసిన రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కూమార్ యాదవ్ అనంతరం ప్రభాకర్ అనే లబ్ధిదారుని ఇంట్లో వారి కుటుంబంతో కలిసి భోజనం చేయడం జరిగింది.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కూమార్ యాదవ్ మాట్లాడుతూ సంక్షేమ చరిత్రలో సన్నబియ్యం సువర్ణ అధ్యాయం.. పేద, మధ్య తరగతి ప్రజల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని అన్నారు.



## నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**రిటైనింగ్ వాల్ నిర్మాణం సకాలంలో నాణ్యతతో పూర్తి చేయాలి**

**రైతులకు ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు**

**పర్యాటక అభివృద్ధి పనులకు విస్తృత ప్రచారం కల్పించాలి**

**ఖమ్మం ఖిల్లా రోప్ వే రోడ్డు సాధ్యమైనంత విస్తరించాలి**

**జూన్ 2026 వరకు ఖమ్మం ఖిల్లా రోప్ వే ప్రాజెక్టు పూర్తి**

**ధాన్యం కొనుగోలు, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, జాతీయ రహదారుల పురోగతి, వెలుగు మట్ల అర్బన్ పార్క్, పర్యాటక అభివృద్ధి పనులపై సమీక్షించిన మంత్రి తుమ్మల**




**ఖమ్మం ప్రజాబలం ప్రతినిధి:**ఖమ్మం, మే -3:ఖమ్మం నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయడం పట్ల అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

శనివారం మంత్రి, ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి ధాన్యం కొనుగోలు, మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం, జాతీయ రహదారుల పురోగతి, వెలుగు మట్ల అర్బన్ పార్క్, పర్యాటక అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గత సంవత్సరం వచ్చిన భారీ వరదల నేపథ్యంలో నిపుణుల కమిటీ సూచనల ప్రకారం చేసిన డిజైన్ మార్పుల మేరకు మున్నేరు నది రిటైనింగ్ వాల్ నిర్మాణం పక్కాగా జరగాలని, రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఖమ్మం నగర వాసులు మరోసారి ఇబ్బందులకు గురి కావద్దని ముఖ్యమంత్రిని ఒప్పించి నిధులు మంజూరు చేశామని, పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడాలని మంత్రి ఆదేశించారు.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి మున్నేరు నది రిటైనింగ్ వాల్ భూ నిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని మంత్రి తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి స్థాయిలో నిర్మించాలని, రెండు వైపుల నుంచి ప్రణాళికాబద్ధంగా పని జరగాలని అన్నారు.

3 లక్షల 50 వేల క్యూసెక్కుల వరద ఉధృతి తట్టుకునేలా 8.5 కిలోమీటర్లకు పైగా రిటైనింగ్ వాల్ రెండు వైపులా పూర్తి చేయాలని, ఇప్పటి నుండి సంవత్సర కాలంలోగా పనులు పూర్తి కావాలని అన్నారు.

# ప్రజాబలం

04 మే 2025 ఆదివారం


## సంగీత సామ్రాజ్య రారాజు త్యాగరాజు

అసంఖ్యాక కీర్తనలకు ప్రాణం పోసి, కర్ణాటక సంగీతంలోని నియమాలను సోదాహరణంగా నిరూపించి, కర్ణాటక సంగీతానికి మూల స్తంభమై, త్రైమూర్త్య వాగ్గేయకారులలో ఒకరై, నాదోపాసన ద్వారా, భగవంతుని తెలుసుకో వచ్చునని నిరూపించి, ఆరాధనీయులు అయినారు... త్యాగయ్య, త్యాగబ్రహ్మగా వినుతికెక్కిన వాగ్గేయ కారుడు కాకర్ల త్యాగరాజు, త్యాగయ్య కీర్తనలు, శ్రీరామునిపై ఆయనకుగల విశేష భక్తిని, వేదాలపై, ఉ పనిషత్తులపై ఆయనకున్న జ్ఞానాన్ని తెలియ పరుస్తాయి. ఉపనయనం తరువాత తండ్రిగారి బోధలు, 18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన రామ షడక్షరీ మంత్ర ప్రభావం, తల్లి అలవర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగ రాజస్వామి వారిలో మూర్తీభవించాయి. నేటి ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా కంభం మండలం కాకర్ల గ్రామంలో, 1767 లో మే 4న, తెలుగు వైదిక కుటుంబీకులైన కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ పుణ్య దంపతులకు త్యాగరాజు మూడవ సంతానంగా జన్మించారు. ఆయన జన్మనామం కాకర్ల త్యాగ బ్రహ్మం. ములకనాడు తెలుగు బ్రాహ్మణులు, త్రిలింగ వైదీకులు, అయన పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా కంభం మండలంలో కాకర్ల అను గ్రామం నుండి తమిళ దేశానికి వలస వెళ్లారు. తండ్రి తంజావూరు ప్రభువు శరభోజి వద్ద ఉండే వారు. తాత గిరిరాజ కవి. త్యాగ బ్రహ్మం విద్యకోసం, తిరువారూర్ నుండి తిరువయ్యూరు వెళ్లారు. అక్కడ సంస్కృతం, వేద వేదాంగములు ఆమూలాగ్రంగా పఠించి, శొంఠి వెంకట రమణయ్య వద్ద, భక్తిశ్రద్ధలతో సంగీతంలో ప్రావీణ్యం సంపాదించు కున్నారు. తండ్రి పిన్న వయసు నందే స్వర్గ ప్రాప్తి నొందగా, అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కారంలో, తమ వంతు వచ్చిన, శ్రీరామ లక్ష్మణ కుల విగ్రహాలను పూజిస్తూ, "ఉ ఛ" వృత్తి స్వీకరించి, ఇష్ట దైవమైన శ్రీ రాముని పై కృతుల రచనలో అధికభాగం గడిపారు. త్యాగయ్య 96 కోట్ల శ్రీరామ నామ జపం ఆచరించి భగవద్దర్శనం, ఆశీర్వచనం పొందారని చెబుతారు. 18 ఏళ్ల వయసులో, పార్వతి అనే యువతిని వివాహ మాడారు. పార్వతి చిరు ప్రాయ మరణంతో, ఆమె సోదరి కమలను పరిణయ మాడారు. సీతా లక్ష్మి అనే కూతురు కలిగింది, ఆమె ద్వారా మనమడు కూడా కలిగాడు. కానీ, మనమడు చిన్నతనం లోనే మృతి చెందడంతో, ఆయనకు వారసులు లేకుండా పోయారు. శొంఠి వెంకట రమణయ్య శిష్యరికంలో 13వ ఏటనే "నమో నమో రాఘవా" అనే కీర్తనను "దేశిక తోడి రాగం"లో స్వరపరిచారు. త్యాగరాజు మంచి వైణికులు కూడా. గురువుగారి గృహములో చేసిన కచేరీలో, త్యాగరాజ పంచరత్న కృతులలో ఐదవది అయిన, "ఎందరో మహానుభావులు" కీర్తన స్వరపరచి గానం చేశారు. త్యాగయ్య గొప్పతనాన్ని గుర్తించిన గురువు, తంజావూరు రాజుకు చెప్పగా, ఆ రాజు ధన, కనక, వస్తు, వాహనాలతో సభకు ఆహ్వానించాడు. కానీ తనకు "నిధి కన్నా రాముని సన్నిధి సేవే సుఖమ"ని భావించి, త్యాగయ్య అన్నింటిని తిరస్కరించారు. సంగీతంలో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం కన్నా, భగవదారాధనకు ఒక సాధనంగానే చూశారాయన. తంజావూరు రాజు కానుకల తిరస్కార ఫలితంగా, సోదరుడు జపేశుడు, త్యాగయ్యచే నిత్య పూజలందుకునే, శ్రీరామ పట్టాభిషేకం విగ్రహాలను, కావేరీ నదిలో విసిరి వేయగా, శ్రీరామ వియోగాన్ని భరించలేక... దక్షిణ దేశ యాత్రలు చేసి, ఎన్నో ఆలయాలు, తీర్థ క్షేత్రాలను దర్శించారు. ఈ క్రమంలో అత్యద్భుత కీర్తనలను రచించారు. "రామేతి మధురం వాచం" అన్నట్లు 96 కోట్ల సార్లు రామ నామాన్ని జపించి, స్వీయానుభవ భావనలే కృతి రూపంలో మలచి గాంధర్వగాన మధురానుభూతిగా లోకానికి అందించారు. భూలోక నారదుడైన త్యాగరాజ స్వామికి, దేవ ఋషి అయిన "నారదుడే స్వయంగా సంగీతంలోని రహస్యాలను చెప్పి, "స్వరార్ణవము" ఇచ్చినట్లు, సందర్భంలోనే "సాధించెనే మనసా" అనే పంచ రత్న మాలిక లోని మూడవ కృతి చేసినట్లు ప్రాచుర్యంలో ఉన్నది. నారద అనుగ్రహ ఫలితంగానే అనేక విషయాలు గ్రహించి, 24వేల రచనలు, 800కీర్తనలు గావించాడు. మంత్రోపదేశంతో "స్వర్ణార్ణవం, నారదీయం" అనే రెండు సంగీత రహ స్మార్థ శాస్త్ర గ్రంథ రచనలు గావించారు. త్యాగయ్య కృతులను ప్రాపంచికం, తాత్వికం, కీర్తనం, నిత్యానుష్టానం, అని నాలుగు విధాలుగా గుర్తించారు. చాలావరకు తెలుగులో రచనలు చేసినా, అవి తెలుగు నాట కన్నా, తమిళ నాట ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. జగదానంద కారకా అనే కీర్తన శ్రీరాముని 109 నామాలను ఉటంకిస్తుంది. "జగదానంద కారకా (నాట), దుడుకు గల (గౌళ), సాధించినే (అరభి), ఎందరో మహాను భావులు (శ్రీ), కన కన రుచిరా (వరాళీ.. అనేవి పంచ రత్న మాలికగా, "త్యాగరాజ ఆరాధనోత్సవాలలో ప్రారంభం కీర్తనలుగా గానం చేయ బడతాయి. త్యాగరాజ స్వామి పరమపదించిన దినమైన, పుష్య కృష్ణ పక్ష పంచమి నాడు, శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధానంగా తమిళనాడు లోని తంజావూరు జిల్లా తిరువయ్యూరు లోని, త్యాగయ్య సమాధి ప్రాంగణాన, ఉత్సవాలు ఏటా జరుగుతాయి. త్యాగయ్య 1847 జనవరి 6న తన 79వ ఏట మరణించగా, ఆయన మరణానికి ముందు సన్యాసిగా మారగా, ఆయన భౌతిక కాయాన్ని కావేరీ తీరాన ఖననం చేసి, అక్కడ స్మారక చిహ్నాల నిర్మాణం గావించారు. ఆయన శిష్యగణం అక్కడే సంస్కరణ కార్యక్రమాలు జరుపగా, 1903 తర్వాత పట్టించుకునే స్థితిలో, ప్రముఖ సంగీత విద్వాంసులైన, ఉ మయాల్పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్లు తమ గురువు సమాధి దయనీయ స్థితికి చలించి, పునరుద్ధరణ గావించారు. 1905లో త్యాగయ్య వర్ధంతి దినాన తిరువయ్యూరులో, అన్నదానం, సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. నాటినుండి దేశంలో పలుచోట్ల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తుం డడం అనవాయితీగా వస్తున్నది. అలాగే త్యాగయ్య జన్మదినం రోజుని భారతీయ సంగీత దినోత్సవంగా జరుపు కుంటారు.

## బాలికల భవిష్యత్ కి బలమైన బాట బాలశక్తి. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.






**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..**బాలికల భవిష్యత్ కోసం నిర్మల్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా బాలశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.

హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్డీ సంస్థలోరాష్ట్రంలోని 33 జిల్లాల విద్యాశాఖ అధికారులు,రీజినల్ డైరెక్టర్లకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పాఠశాల, విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణ ఆహ్వానం మేరకు శు క్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బాలికల కోసం నిర్మల్ జిల్లాలోని 57 వసతిగృహ పాఠశాలలలో అమలవుతున్న.బాలశక్తి.కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో విజయవంతంగా అమలవుతున్న బాలశక్తి కార్యక్రమంలోని నాలుగు కీలక అంశాలైన హెల్త్ అండ్ వెల్నెస్, ఫైనాన్షియల్ లిటరసీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఎక్స్పోజర్ విజిట్స్ పై విస్తృతంగా వివరించారు.బాలశక్తి కార్యక్రమంలో ఆరోగ్యం,వెల్నెస్,ఆర్థిక అవగాహన, నైపుణ్య అభివృద్ధి, సామాజిక సంస్థల సందర్శనలపై కేంద్రంగా పనిచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, బాలికలకు పోషకాహారం, కళ్లద్దాలు,అవసరమైన వైద్యసాయం అందించినట్లు పేర్కొన్నారు.బాలికల్లో ఆర్థిక, సాంఘిక అవగాహన,క్రమశిక్షణ పెంచేందుకు జిల్లాలోని ప్రముఖ బ్యాంకులకు, ప్రభుత్వ రంగ సంస్థలకు,చారిత్రాత్మక ప్రదేశాలను విద్యార్థులు సందర్శించినట్లు తెలిపారు.కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి స్కిల్ కోర్సులు అమలు చేస్తున్నామని తెలిపారు.నిర్మల్ జిల్లాలోని 57 వసతిగృహ పాఠశాలల విద్యార్థులు చారిత్రాత్మక ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించడంతో వారికి విశేష అనుభవం లభించిందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్ఆర్డీ డైరెక్టర్ రమేష్, జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ, జిల్లాల విద్యాశాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఏకకాలంలో నిర్మల్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పరిది లో నాఖాబంది:జిల్లా ఎస్పి డా.జానకి షర్మిల





**ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..**నిర్మల్ జిల్లా ఎస్పి డా. జానకి షర్మిల ఆదేశాల మేరకు భైంసా ఎ.ఎస్పి. అవినాష్ కుమార్ ఐపిఎస్ మరియు నిర్మల్ ఏ.ఎస్పి రాజేష్ మీన ఐపిఎస్ ల పర్యవేక్షణలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ ల పోలీస్ సిబ్బంది మరియు జిల్లా ఎఅర్ సిబ్బంది తో శనివారం సాయత్రం ఒకేసారి నాఖాబంది నిర్వహించారు . సరియైన ఆధారాలు, నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు పట్టుకోవటం జరిగింది. ఇటీవల కాలంలో రోడ్డుప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణం మద్యం మత్తులో వాహనాలు నడపడం ఒకటైతే మరొకటి ర్యాష్ డ్రైవింగ్, ఇన్సూరెన్స్ లేని వాహనాల వాళ్ళ జరిగే ప్రమాదాలలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబానికి ఎటువంటి ఆర్థిక సహాయం అందదు. ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీసులు ఎస్పి గారి ఆదేశాలతో ప్రతిరోజు నగరంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అన్ని లాడ్జ్ లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. శాంతి భద్రతల పరిరక్షణ,నేర నియంత్రనే మరియు రోడ్డు ప్రమాదాల నియంత్రనే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఒకేసారి నాఖబంది నిర్వహించటం జరిగింది.ఈ తనిఖీల్లో అవినాష్ కుమార్ ఐపిఎస్, రాజేష్ మీన ఐపిఎస్, జిల్లాలోని ఇనస్పెక్టర్ లు,ఎస్ఐ లు.ప్రొబేషనరీ ఎస్ఐ లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ నియోజకవర్గ ప్రతినిధి మే 3(ప్రజాబలం)**మెదక్ జిల్లా:మెదక్/వేసవి లో భానుడి ప్రతాపం రోజు రోజుకి తీవ్రరూపం దాల్చి ప్రజలను అనారోగ్యానికి గురయ్యేలా చేస్తున్న నేపథ్యంలో వేసవికాలం ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్య వడదెబ్బ. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా బయట పనికి వెళ్లే వాళ్లే కాదు.. ఇంట్లో ఉండే వృద్ధులు, పిల్లలు కూడా వడదెబ్బకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయని ఈ సందర్భంగా కొన్ని జాగ్రత్తలు పాటించి వడదెబ్బ తగలకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే.. ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉంటుందని,వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండాలంటే, శరీరానికి తగినంత నీరు అందించడం, ఎండ తగలకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవడం,తేలికైన దుస్తులు ధరించడం, మధ్యాహ్న వేళలో బయటకు వెళ్లకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లవలసివస్తే గొడుగు , వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవడం ముఖ్యం.వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు:



శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోండి,వేసవిలో శరీరానికి తగినంత నీరు అందించడం చాలా అవసరం. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి, ముఖ్యంగా చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు వంటివి. ఎండలో ఎక్కువసేపు ఉండటం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ తగలవచ్చు. కాబట్టి, నీడలో ఉండటం, టోపీ, గొడుగు వంటివి ఉపయోగించడం, సూర్యరశ్మిని నిరోధించే దుస్తులు ధరించడం మంచిది. తేలికైన దుస్తులు ధరించండి:వేసవిలో తేలికపాటి వస్త్రాలను ధరించడం మంచిది. రంగుల దుస్తులను ధరించడం వల్ల సూర్యరశ్మి శరీరంపైకి ఎక్కువగా పడుతుంది. మధ్యాహ్న వేళలో ఎండ చాలా ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ఆ సమయంలో బయటకు వెళ్లడం మంచిది కాదు. వీలైతే ఉదయం, సాయంత్రం గాలి చల్లగా ఉన్నప్పుడు బయటకు వెళ్లడం మంచిది. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోండి:వడదెబ్బ లక్షణాలు (తలనొప్పి, వాంతులు, మైకము, అధిక జ్వరం, తల తిరగడం, స్పృహ కోల్పోవడం) కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. పిల్లలు వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధ:పిల్లలు వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకూడదు. వీలైనంతవరకు ఇంట్లోనే ఉంచడం మంచిది,మందులు సక్రమంగా తీసుకోండి:ఏదైనా మందులు తీసుకుంటున్నట్లయితే, డాక్టర్ సూచనల ప్రకారం మందులు తీసుకోవడం చాలా ముఖ్యం అని పేర్కొన్నారు.

## శ్రీ రేణుక మాత ప్రతిష్ట మహోత్సవాలు




**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి మే 3(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సదాశివపేట మండలంలోని పెద్దాపురం గ్రామంలో శ్రీ రేణుక మాత విగ్రహ ప్రతిష్ట మహోత్సవ సందర్భంగా శనివారం నాడు పసుపు కొట్టం మరియు ఎల్లమ్మ తల్లి బోనాలు గ్రామంలోని మహిళలందరూ భారీ ఎత్తున ఎల్లమ్మ తల్లి బోనాలను అంగరంగ వైభవంగా ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించి తమ యొక్క మొక్కలు తీర్చుకోవడం జరిగింది%ఓ%అనంతరం ఎల్లమ్మ జీవిత చరిత్ర ఒగ్గు కథ నిర్వహించడం జరిగింది,ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న సదాశివపేట మున్సిపల్ మాజీ చైర్మన్ అపర్ణ శివరాజ్ పాటిల్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ లకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వచ్చిన అతిథులకు శాలువా వేసి పూలమాలతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాదం వితరణ చేయడం జరిగింది.



# ఇక చకచకా అమరావతి పనులు

విజయవాడ, మే ఏపీ రాజధాని అమరావతి ప్రాధాన్యత, ప్రత్యేకత, నిర్మాణంపై సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన కీలక వ్యాఖ్యలివి. ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలతో ఏపీకి ఒక భరోసా, రాజధాని కల సాకారమైందన్న ఒక నమ్మకం కలిగినట్లు అయింది. రాజదాని అమరావతి నిర్మాణాన్ని మనం చెయ్యాలి?మనమే చెయ్యాలని మోదీ నొక్కిమరీ చెప్పారు. అంటే ఏపీలో ఇప్పుడున్నది కూటమి ప్రభుత్వం. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఏర్పాడ్డాయి.కేంద్రంలో బీజేపీ సర్కార్ ఉంది. దీంతో రాజధాని నిర్మాణానికి పూచికపుల్లంతా అడ్డుకూడా రాదనేది మోదీ మాటలను బట్టి అర్థం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని నిర్మాణానికి కావాల్సిన నిధులిచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. కావాల్సిందల్లా రాజధాని నిర్మాణం..అదీ కేంద్రం సహకారంతో ఏపీలోని కూటమి ప్రభుత్వం పూర్తి చేయాలని మోదీ స్పష్టంగా చెప్పకనే చెప్పారన్నారు.వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చుంటే ఏంటి అన్నట్లుగా?కేంద్రంలో మోదీ సర్కార్ ఉండడంతో ఇక రాజధాని అమరావతి నిర్మాణానికి ఎవరూ అడ్డుపడరని..ఏదీ అడ్డు రాదని?చకచకా రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మించుకోవాలని ఫుల్ పవర్స్ ఇచ్చేశారు ప్రధాని మోదీ. 2019 ఎన్నికల్లో జగన్ సీఎం కావడంతో అమరావతి నిర్మాణానికి ఒక్కసారిగా బ్రేకులు పడ్డాయి. మూడు రాజధానుల అంశాన్ని జగన్ తెరపైకి తేవడంతో అప్పటివరకున్న అమరావతి తెరమరుగైంది.సీన్ కట్ చేస్తే ఏపీలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో రాజధాని అమరావతిపై ఐదుకోట్ల ఆంధ్రుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. మరోసారి ప్రధాని మోదీ అమరావతి పునర్మిర్మాణ పనులను ప్రారంభించడంతో..ఐదు కోట్ల ఆంధ్రులు కన్న కలలు ఎట్టకేలకు సాకారం కాబోతున్నాయి. ఉమ్మడి ఏపీ విభజన తర్వాత ఇన్నాళ్లూ రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న ఏపీకి ఇప్పుడొక రాజధాని అనేది ఖరారైంది. దీంతో ఆంధ్రుల కలల రాజధాని అమరావతి తిరిగి పురుడు పోసుకుంది. అనేక సవాళ్లు, పోరాటాల మధ్య అమరావతి పునరుజ్జీవం పొందింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి రాజధాని అమరావతి బాటలు వేయనుంది.ప్రధాని మోదీ రాకతో అమరావతి 2.0 మొదలైంది. ఏపీ రాష్ట్రంలో నవశకం మొదలైందనే చెప్పాలి. అమరావతి నిర్మాణ పనులను ఏకకాలంలో చేపట్టేలా దాదాపు 77,250 కోట్లతో అంచనాలు సిద్ధం చేసింది కూటమి ప్రభుత్వం. ఇదే క్రమంలో 49వేల కోట్ల పనులకు ఇప్పటికే టెండర్లను ఖరారు చేసింది. దీంతో రాజధాని నిర్మాణ పనులను పరుగులు పెట్టిస్తోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ వీలైనంత తొందరగా పని పూర్తి చేయాలని ఫిక్సయ్యింది.ఇదే సమయంలో రాజధాని అమరావతికి రైలు సౌకర్యం కల్పించేందుకు రైల్వే బోర్డు కూడా అంగీకారం తెలుపుతూ 2వేల 47కోట్లను మంజూరు చేసింది. ఎర్రుపాలెం-నంబూర్ మధ్య 56.53 కి.మీ. మేర రైల్వే లైన్ రానుంది. అదేవిధంగా 189.4 కి.మీ. పొడవున అమరావతి అవుటర్ రింగ్ రోడ్ ను 16,310 కోట్లతో చేపట్టేందుకు కేంద్రం ఆమోదించింది. దీనికి సంబంధించిన ఖర్చును భరించేందుకు కేంద్రం ముందుకొచ్చింది.మొత్తానికి కేంద్రం సహకారంతో అమరావతి నిర్మాణ పనులు చకచకా సాగిపోనున్నాయి. దీంతో ఏపీ రాజధాని అమరావతి కల అతి త్వరలోనే సాకారం కాబోతుంది. మరో మూడు, మూడున్నరేళ్లలో అమరావతి ఓ అందమైన రూపాన్ని సంతరించుకోనుంది. దీని కోసం ఐదు కోట్ల ఆంధ్రులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

# అమరావతిపైనే బాబు కోటి ఆశలు

విజయవాడ, మే 3, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలల రాజధానికి మరి కొద్ది క్షణాల్లో శంకుస్థాపన జరగనుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి వచ్చి మరీ పాల్గొంటున్నారు. ముందుగా సేకరించిన 33 వేల ఎకరాలకు తోడు మరో 44 వేల ఎకరాలను సేకరించి దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఇందుకోసం ఎంతదూరమైనా వెళ్లేందుకు ఆయన సిద్ధపడుతున్నారు. విమర్శలను సయితం పక్కన పెట్టి రాజధాని నిర్మాణం పూర్తయితే వచ్చేకిక్కు కోసం ఆయన వెయిట్ చేస్తున్నారు. తాను హైదరాబాద్ లో సైబరాబాద్ ను డెవలప్ చేసినపుడు వచ్చిన ఇమేజ్ కు మించి అమరావతి నిర్మాణంతో రావాలని నాయుడుగారు భావిస్తున్నారు. అందుకోసం లక్షల కోట్ల రూపాయలను వెచ్చించడానికి సిద్ధపడుతున్నారు. తొలిదశలోనే దాదాపు నలభై మూడు వేల కోట్ల రూపాయల విలువైన పనులకు నేడు శంకుస్థాపన జరగుతుంది. ఇంకా రాజధాని ప్రాంతంలో నవనగరాల నిర్మాణంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మిస్తే చాలు ఇక తన జీవితం చరితార్థమవుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే వందలకోట్ల రూపాయలు వెచ్చించి ఇంత ఆర్భాటంగా చంద్రబాబు నాయుడుఅమరావతి రాజధాని పనులకు శంకుస్థాపన మళ్లీ చేయనున్నారు. దీనికి రీ లాంచింగ్ అని పేరు పెట్టినా అమరావతికి హైప్ తెచ్చేందుకే మరోసారి శంకుస్థాపనలు చేయిస్తున్నారన్నది వాస్తవం. . దాదాపు డెబ్బయి ఏడు ఎకరాలు ఒక్క రాజధానిలో ఉండటంతో పాటు విజయవాడ, గుంటూరు నగరాలను కలిపితే ఇక ఏపీకి తిరుగుండదని చంద్రబాబు అంచనా వేస్తున్నారు. అప్పుడు పెట్టుబడుల కోసం తాము కాళ్లరిగేలా తిరగాల్సిన పనిలేదని, వాటంతట అవే వచ్చిపడతాయన్న నమ్మకంతో ఏపీ సీఎం ఉన్నారు. మరోవైపు వీలయినంత త్వరగా కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా ఏర్పాటు చేసే విధంగా సహకరించాలంటూ నేడు మోదీని చంద్రబాబు నాయుడు కోరనున్నారు. ఇప్పటకే కేంద్ర ప్రభుత్వ సంస్థలకు రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం భూములను కేటాయించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర నుంచి అనేక ప్రముఖ సంస్థలు ఇక్కడ తమ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కోరనున్నారు. దీంతో పాటు రైతులు ప్లాట్లుగా ఇచ్చిన భూమి పోగా ప్రభుత్వానికి భారీగా వేలాది ఎకరాలు మిగలనున్నాయి. ఈ మిగిలిపోయిన ఎకరాలను వేలం వేసినా రాజధాని నిర్మాణం కోసం చేసిన ఖర్చు వెనక్కు తిరిగి వస్తుందని చంద్రబాబు అంచనా. అందుకే తెగించి ఆయన ఈ నిర్ణయం తీసుకునట్లే కనపడుతుంది.

వేగంగా రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసిన తర్వాత తనకు ఇంకేమీ ఆశ మిగలదని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అంటే ఆయన అమరావతి నిర్మాణాన్ని ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారో అర్థమవుతుంది. రాజధాని అమరావతి పూర్తయిన తర్వాత తనను తెగిడిన వాళ్లు కూడా ఖచ్చితంగా పొగుడ్తారని ముందుకు చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. మరి ఏం జరుగుతుందన్నది తెలియాలంటే మరో మూడేళ్ల కాలం వెయిట్ చేయాల్సిందే.

# వైఎస్ భారతి స్కూల్ గురించి తెలుసా

కడప, మే 3, పులివెందుల ప్రాంతంలో వెంకటప్ప స్కూలు చాలా ఫేమస్. వెంకటప్ప.. వైఎస్ రాజశేఖర్ రెడ్డికి గురువు. వెంకటప్పపై గౌరవంతో దీన్ని ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో.. వైఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఈ పాఠశాలను జగన్ 2007-08 విద్యా సంవత్సరంలో ప్రారంభించారు.ఈ పాఠశాల పులివెందులలోని భాకరాపురం వైఎస్ జగన్ ఎస్టేట్‌లో 15 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అత్యాధునిక వసతులతో దీన్ని నిర్మించారు. వైఎస్ భారతి ఈ పాఠశాల కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. పాఠశాలలో అర్హులైన పేద విద్యార్థులందరికీ ఉచితంగా విద్య, దుస్తులు, పుస్తకాలు, ఇతర ఫీజులను వైఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా అందిస్తారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ప్రవేశాల కోసం ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించారు. దీనికి భారీ స్థాయిలో స్పందన వచ్చింది.ఈ పాఠశాలను వైఎస్ రాజశేఖర రెడ్డి గురువు వెంకటప్ప జ్ఞాపకార్థంగా స్థాపించారు.పేద, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యంతో దీనిని ఏర్పాటు చేశారు.ఈ పాఠశాల 2007-08 విద్యా సంవత్సరం నుండి కార్యకలాపాలు ప్రారంభించింది.వైఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నడుస్తోంది.

ప్రత్యేకతలు..

ఇది ఇంగ్లీష్ మీడియం పాఠశాల.

పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్య, ట్యూషన్ ఫీజు, పరీక్ష ఫీజు, యూనిఫాం, పుస్తకాలు అందిస్తారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న స్థానిక పిల్లలు ప్రవేశానికి అర్హులు.

ఈ పాఠశాలలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఇందులో 46 తరగతి గదులు, ఒక లైబ్రరీ, ఒక సైన్స్ ల్యాబ్, ఒక యాక్టివిటీ రూమ్, ఒక రీడింగ్ హాల్, ఒక ఆడియో విజువల్ రూమ్ ఉన్నాయి.

విద్యార్థుల రాకపోకల కోసం రెండు బస్సులు అందుబాటులో ఉన్నాయి.

పాఠశాలలో కంప్యూటర్ విద్యను కూడా అందిస్తారు.

విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.ఆంగ్లంలో ప్రత్యేక వేసవి శిక్షణ కూడా ఇస్తారు.

పాఠశాల కరస్పాండెంట్ వైఎస్ భారతి వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తారు. నెలలో రెండుసార్లు పాఠశాలను సందర్శిస్తారు.

ఈ పాఠశాల ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌కు అనుబంధంగా ఉంది.

ఇది కో-ఎడ్యుకేషనల్ (బాలురు, బాలికలు కలిసి చదువుకునే) పాఠశాల.

పూర్తి వివరాలు..

స్థలం- భాకరాపురం, పులివెందుల, కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 516390

విస్తీర్ణం- 15 ఎకరాలు

మౌలిక సదుపాయాల వ్యయం రూ.5 కోట్లు

తరగతులు- ప్రాథమిక, ఉన్నత పాఠశాల

బోధనా మాధ్యమం- ఆంగ్లం

గుర్తింపు- ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్

యాజమాన్యం- వైఎస్ఆర్ ఫౌండేషన్

ఉపాధ్యాయులు- 44

బోధనేతర సిబ్బంది- 31

# పట్టుకోండి చూద్దాం...

నెల్లూరు, మే 3, కాకాణి గోవర్ధన్ రెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఏప్రిల్ మూడో తేదీన ఆయన పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా ఆయన మాత్రం దొరకడం లేదు. హైకోర్టులో కాకాణి గోవర్ధన్ రెడ్డి ముందస్తు బెయిల్ తిరస్కరించడంతో ఆయన అప్పటి నుంచి అదృశ్యమయ్యారు. అప్పటి నుంచి దాదాపు ఏడు బృందాలు పోలీసులు నిరంతరం గాలిస్తున్నాయి. ఎక్కడా ఆయన ఆచూకీ దొరకడం లేదు. గత కొన్ని రోజులుగా కాకాణి గోవర్ధన్ రెడ్డి కనిపెట్టలేకపోవడంతో పోలీసులపై ప్రభుత్వం పెద్దలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. దాదాపు నెల రోజుల నుంచి కాకాణి తప్పించుకుతిరుగుతున్న పట్టుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కాకాణి గోవర్ధన్ రెడ్డి పోలీసుల విచారణకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నారు. హైకోర్టులో కూడా ఆయనకు ముందస్తు బెయిల్ రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కాకాణి గోవర్ధన్ రెడ్డి తప్పించుకుతిరుగుతుండటంతో నెల్లూరు, హైదరాబాద్, చెన్నై ప్రాంతాలకు వెళ్లిన పోలీసులు ఆయన కోసం గాలిస్తున్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ మైనింగ్ కేసులు నమోదయ్యాయి. ఎస్సీ, ఎస్టీ కేసు కూడా నమోదయింది. విచారణకు హాజరు కాకుండా ఉన్న కాకాణిని ఎలాగైనా అరెస్ట్ చేయాలని పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఎన్నిమార్లు ఇంటికి వెళ్లినా కుటుంబ సభ్యుల నుంచి మాత్రం ఒకటే సమాధానం. తమకు తెలియదని, కాకాణి గోవర్ధన్ రెడ్డి ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో పాటు ఆయన ఎక్కడకు వెళ్లారన్నది అర్థం కాకుండా ఉంది. పోలీసులు అన్ని రకాలుగా నిఘా పెట్టారు. కాకాణి గోవర్ధన్ రెడ్డికి సంబంధించిన సన్నిహితుల పై కూడా కన్నేసి ఉంచారు. వారి ఫోన్లను కూడా ట్రాప్ చేస్తున్నారు. అయినా కాకాణి గోవర్ధన్ రెడ్డి మాత్రంఎవరికీ ఫోన్లు చేయడం లేదు. ఇలా దాదాపు నెల రోజుల నుంచి పోలీసుల కళ్లుగప్పితప్పించుకుని తిరుగుతుండటం పోలీసులకు సవాల్ గా మారింది.

# అధ్యాత్మికత కంటే ఆదాయంపైనే అధికారులు దృష్టి

విజయవాడ, మే 3, ఏపీ దేవాదాయ శాఖను దేవుడే రక్షించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. భక్తి విశ్వాసాలను కాపాడాల్సిన దేవాదాయ ధర్మాదాయ శాఖలో అధ్యాత్మికత కంటే ఆదాయంపైనే అధికారులు దృష్టి సారిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో సాగాల్సిన పాలనను ఇంఛార్జిలకు అప్పగించడం వెనుక మతలబు ఏమిటో తెలియాల్సి ఉంది.ఏపీ దేవాలయాల్లో వరుస ప్రమాదాల్లో భక్తులు ప్రాణాలు కోల్పవడానికి దేవాదాయ శాఖకు సరైన సారధి లేకపోవడమేననే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా ఇంఛార్జిలతో దేవాదాయ శాఖను నడిపించడమే సమస్యకు మూల కారణంగా కనిపిస్తోంది.దేవుడి దర్శనాలకు వచ్చిన భక్తులు ప్రమాదాల్లో మరణిస్తున్న ఏపీ దేవాదాయ శాఖలో మాత్రం చలనం రావడం లేదు. ప్రమాదాలపై విచారణ కమిటీలు వేసి చేతులు దులుపుకోవడం మినహా దేవాదాయ శాఖను ప్రక్షాళన చేసే ప్రయత్నాలు మాత్రం జరగడం లేదు.సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో భక్తులు చనిపోవడం అందరిని కలిచి వేసింది. రాష్ట్రంలోని ఏ గ్రేడ్ దేవాలయాల్లో ఒకటైన సింహాచలం దేవస్థానానికి ఇప్పటి వరకు పూర్తి స?థాయి ఈవో లేరు. సింహాచలం దేవస్థానానికే కాదు ఏపీ దేవాదాయ శాఖకు కూడా పూర్తి స్థాయి కమిషనర్ లేరు.రాష్ట్రంలో అత్యంత కీలకమైన దేవస్థానాల్లో సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఒకటి. ప్రస్తుతం దేవాదాయ శాఖ కమిషనర్‌గా ఉన్న రామచంద్రమోహన్ కూడా గతంలో అక్కడ ఈవోగా పనిచేశారు. విజయవాడ ఇంద్రకీలాద్రి, శ్రీకాళహస్తి, అన్నవరం, శ్రీశైలం, కాణిపాకం, సింహాచలం వంటి ఆలయాలకు దేవాదాయ శాఖలో సీనియర్లుగా ఉన్న అధికారులను ఈవోలుగా నియమిస్తారు.స్వతంత్ర సంస్థగా ఉన్న టీటీడీకి మాత్రమే ప్రస్తుతం ఐఏఎస్ అధికారి ఈవోగా ఉన్నారు. ఏడు ప్రధాన ఆలయాల్లో ద్వారకాతిరుమల, కనకదుర్గమ్మ ఆలయాలకు తప్ప సింహాచలం, అన్నవరం, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి ఆలయాలకు రెవెన్యూ అధికారులే ఈవోలుగా ఉన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ఆలయాలను దేవాదాయ శాఖ అధికారులు ఆదాయ వనరులుగా మార్చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి.దేవాదాయ శాఖ కమిషనర్‌లుగా ఐఏఎస్ అధికారుల్ని నియమిస్తే అక్రమాలు సాగవనే ఉద్దేశంతోనే వారిని నియమించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.సింహాచలంలో వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి చందనోత్సవానికి ఏపీ సీఎం చంద్రబాబు హాజరవుతారని తొలుత జీవో విడుదల చేశారు. ప్రధాని పర్యటన, అమరావతి రాజధానిలో కార్యక్రమాల నేపథ్యంలో చివరి నిమిషంలో ముఖ్యమంత్రి సింహాచలం పర్యటన రద్దు అయ్యింది. ఆయన స్థానంలో రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న ఆనం సింహాచలం చందనోత్సవానికి హాజరు కాలేదుదేవాదాయ శాఖకు కమిషనర్ నియామకం విషయంలో కొందరు చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ శాఖకు మంత్రిగా ఆనం రాంనారాయణ రెడ్డి ఉన్నా, ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ మంత్రి ఓఎస్డీ దేవాదాయ శాఖలో ఇంచార్జి కమిషనర్ నియామకంలో చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. ఐఏఎస్ అధికారులతో సాగాల్సిన పాలనా వ్యవహారాలు ఇంచార్జితో సాగడం వెనుక బడా నేతల స్కెచ్ ఉందనే ఆరోపణలున్నాయి.దేవాదాయ శాఖ పరిధిలో కోట్లాది రుపాయల ఆస్తులు, భూములు ఉంటాయి. వీటన్నింటి సంరక్షణ బాధ్యతలు కమిషనర్ చేతుల్లోనే ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భూములు వివాదాల్లో ఉన్నాయి. కోర్టు తీర్పులు ఉన్నా అన్యాక్రాంతమైన భూముల్ని స్వాధీనం చేసుకునే విషయంలో దేవాదాయ శాఖ చోద్యం చూస్తోంది.ప్రభుత్వానికి పెద్ద సంఖ్యలో దేవాదాయ భూముల అన్యాక్రాంతం అవుతున్న ఘటనలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను పర్యవేక్షించే అధికారులు వాటిని పరిష్కరించకుండా అడ్డు పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల్ని తమ చెప్పు చేతుల్లో ఉంచుకుని చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.దేవాదాయ శాఖలో ఇంచార్జిలకు బాధ్యతలు అప్పగించిన తర్వాత పలు వివాదాస్పద భూముల వ్యవహారాలు తెరపైకి వచ్చాయి. విజయవాడలో వందల కోట్ల ఖరీదు చేసే దుర్గగుడి ఆలయ భూములను కారుచౌకగా యాభై ఏళ్లకు లీజుకు ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అభ్యంతరం చెప్పడంతో ఆ ఫైల్ నిలిచిపోయింది. ఈ భూముల వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల ఒత్తిడి ఉందనే ఆరోపణలు ఉన్నాయి.విజయవాడ పటమటలో ఉన్న నల్లూరి వారి సత్రంకు చెందిన ఫంక్షన్ హాల్, వెంకటేశ్వర స్వామి ఆలయాలను స్వాధీనం చేసుకోవాలని ఏపీ హైకోర్టు 2022లో ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికీ అవి అమలు కాలేదు. ఈ వ్యవహారంలో అర్చకులు మంత్రి నారా లోకేష్ కు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. దేవాదాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి ఎలాంటి వివాదం లేదని కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. ట్రస్టీలతో కుమ్మక్కై దేవాదాయ శాఖ అధికారులు ఈ నివేదిక ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో అర్చకులు అధికారులకు ఫిర్యాదు చేశారు.విజయవాడ పటమటలో ఉన్న గోవిందరాజులు ఈనాం ట్రస్టుకు చెందిన భూముల్ని లీజు దారుడు జాతీయ బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.100కోట్ల రుణం తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. దేవాదాయ శాఖకు దానపత్రం రాసిన భూముల్ని బ్యాంకులో తాకట్టు పెట్టిన వ్యవహారంపై దేవాదాయ శాఖ అధికారులు నోరు మెదకపడం లేదు. బ్యాంకు అధికారులు కూడా ఫిర్యాదు చేయకు పోవడం అనుమానాలకు తావిస్తోంది.లక్షల ఎకరాల భూములతో కోట్లాది రుపాయలు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నా వాటిని సంరక్షించడం కంటే అయినకాడికి సొమ్ము చేసుకుందామనుకునే ధోరణి దేవాదాయ శాఖ ఉద్యోగుల్లో కనిపిస్తోంది.దేవాదాయశాఖలో కమిషనర్‌గా ఉన్న ఎస్.సత్యనారాయణను బదిలీ చేసిన తర్వాత ఐఏఎస్ అధికారిని ఆ పోస్టులో నియమించలేదు. అదనపు కమిషనర్-2గా ఉన్న రామచంద్ర మోహన్‌కు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో ప్రధాన దేవాలయమైన కనకదుర్గ ఆలయానికి కూడా ఆయనే ఇన్‌చార్జి ఈవోగా ఉన్నారు.దేవాదాయ శాఖలో 11 ఆర్జేసీ పోస్టులున్నాయి. డైరెక్టుగా డిప్యూటీ కమిషనర్ల నియామకం చేపట్టి, అసిస్టెంట్ కమిషనర్లకు డిప్యూటీ కమిషనర్లుగా పదోన్నతులు కల్పిస్తే.. తర్వాత రెండేళ్లకు వాళ్లకు ఆర్జేసీగా పదోన్నతులు లభిస్తాయి. ప్రస్తుతం దేవాదాయ శాఖలో భ్రమరాంబ, సత్యనారాయణమూర్తి, త్రినాథ్‌రావు, చంద్రశేఖర్ ఆజాద్ మాత్రమే రెగ్యులర్ ఆర్జేసీలు.రీజినల్ జాయింట్ కమిషనర్‌లలో భ్రమరాంబ, సత్యనారాయణమూర్తి ఈ ఏడాది, త్రినాథ్‌రావు, ఏడీసీ చంద్రకుమార్ వచ్చే జనవరిలో పదవీవిరమణ చేస్తారు. మిగిలిన ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ పై గతంలో ఏసీబీ దాడులు జరిగాయి.విశాఖపట్నంలోని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తెల్లవారుజామున క్యూలైన్ పై గోడ కూలి ఏడుగురు మృతి చెందడానికి గల కారణాలపై విచారణ జరిపేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది.దుర్ఘటన అనంతరం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.300 దర్శన మార్గం ప్రవేశ ద్వారం నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో బస్టాప్ సమీపంలోని కొండపై గోడ కూలింది.పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీపీ) ఆకే రవికృష్ణ, ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఇరిగేషన్) ఎం.వెంకటేశ్వర్రావు సభ్యులుగా ఉంటారు.ఈ ఉత్తర్వులు జారీ చేసిన 72 గంటల్లోగా కమిటీ తన ప్రాథమిక నివేదికను సమర్పించాలని, 30 రోజుల్లోగా పరిశోధనలు, సిఫార్సులతో కూడిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# వీరయ్య చౌదరి మర్డర్ కేసులో కనిపించని పురోగతి

ఒంగోలు, మే 3, ఏపీలో సంచలనంగా మారిన తెలుగుశేం పార్టీ నేత, ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్యకేసు మిస్టరీ ఇంకా వీడలేదు. పలువురు అనుమానితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు పోలీసులు నిందితుల అరెస్ట్, హత్యకు సంబంధించిన అంశాలపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే ఈ కేసులో కొన్ని కీలక విషయాలు బయటకొచ్చాయనే టాక్ వనిపిస్తోంది. ఈ కేసులో ఇద్దరు, ముగ్గుర్ని ప్రధాన సూత్రధారులుగా అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు పోలీసుల అదుపులో ఉండగా.. మరికొందరి కోసం గాలిస్తున్నారు. ఈ హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న నిందితలుకు సంబంధించి కూడా క్లారిటీ లేకుండా పోయింది. ముప్పవరపు వీరయ్య చౌదరికి రాజకీయంగా ప్రత్యర్థులుగా ఉన్నవారు.. ఒంగోలుకు చెందిన యువకుడితో కలిసి ఈ హత్య చేయించినట్లు కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది.వీరయ్యచౌదరి హత్యకేసులో ఒంగోలుకు చెందిన యువకుడు ఎందుకు భాగస్వామి అయ్యాడనే చర్చ సాగుతోంది. ఆ యువకుడే ఈ హత్యకు ప్లాన్ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే వీరయ్య చౌదరిని చంపిన వారికి నేర చరిత్ర ఉందనే టాక్ వినిపిస్తోంది. ఈ హత్య కోసం ఒంగోలుకు చెందిన యువకుడు ఒకరితో మరొకరికి పరిచయం లేని వారిని ఎంపిక చేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరయ్య చౌదరికి సంబంధించిన వివరాలు చెప్పకుండానే.. నేరుగా హత్యకు హత్యకు ఉసిగొల్పినట్లు ప్రచారం జరుగుతోంది. వీరయ్య చౌదరి హత్యకేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒంగోలుకు చెందిన యువకుడు ముందు డ్రైవింగ్ చేసేవాడు.. ఆ తర్వాత సొంత వ్యాపారం ప్రారంభించాడు. అతడు ఇసుక రవాణా కూడా చేసేవాడని తెలుస్తోంది.ఒంగోలు యువకుడికి వీరయ్య రాజకీయ ప్రత్యర్థుల్లో ఒకరి (ఓ నేత)తో పరిచయాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ నేత ఆ యువకుడ్ని బావా అని పిలుచుకునేంత సాన్నిహిత్యం ఉందని.. గతంలో కొంతకాలం ఇద్దరు కలిసి ఇసుక రవాణా చేసినట్లు తెలుస్తోంది. బావా అని పిలిచే సాన్నిహిత్యం ఉండటంతోనే ఒంగోలు యువకుడు బావ కళ్లలో ఆనందం కోసం ఈ హత్యకు ప్లాన్ చేశాడా అనే చర్చ జరుగుతోంది. లేని పక్షంలో డబ్బుల కోసమే చేశాడా అన్నది వివరాలు తెలియాల్సి ఉంది. ఒంగోలు యువకుడు దొరికితే కానీ ఈ కేసు ఓ కొలిక్కి వస్తుందంటున్నారు. ఈ హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్నవారికి నేర చరిత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ముప్పవరపు వీరయ్య చౌదరిని అత్యంత దారుణంగా హతమార్చారు.. ఏకంగా 53 కత్తిపోట్లు పొడిచారు, కేవలం నాలుగు నిమిషాల్లోనే అంతా జరిగిపోయింది. వీరయ్యను చంపే క్రమంలో ఓ నిందితుడి చేతికి గాయమైనట్లు తెలుస్తోంది. ఆ గాయాల నుంచి కారిన రక్తమే ఇటీవల దొరికిన స్కూటీపై పడినట్లు తెలుస్తోంది. అయినా సరే ఆ స్కూటీపైనే నిందితులు పారిపోయినట్లు చెబుతున్నారు. ఈ హత్య చేసినవాళ్లలో నెల్లూరుకు చెందినవాళ్లు ఉన్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. వీరికి గతంలో కొన్ని హత్య కేసుల్లో ప్రమేయం ఉందంటున్నారు. ప్రకాశం జిల్లా పోలీసులు ఈ హత్యకేసు విచారణను మరింత వేగవంతం చేశారు.. ప్రస్తుతం వారి అదుపులో ఉన్న అనుమానితులు ఈ హత్య చేశారా?.. వేరేవారి హస్తం ఉందా అనేది తేలాల్సి ఉంది. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తులపై అనుమానాలు మాత్రమే ఉన్నాయి.. వారి పాత్ర గురించి ఇప్పటి వరకు పోలీసులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.. వారు

# చిన్నారులకు ఆధార్ క్యాంపులు

తిరుపతి, మే 3,ఏపీలో ఆరేళ్ల లోపు చిన్నారులందరికీ ఆధార్ కార్డు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన చర్యలు చేపట్టింది. ఈ మేరకు మే నెలలో రెండు విడతలుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలను నిర్వహించనున్నారు. మొదటి విడత మే 5వ తేదీ నుంచి ప్రారంభమై 8వ తేదీ వరకు కొనసాగుతుంది. రెండవ విడత మే 12వ తేదీ నుంచి మొదలై 15వ తేదీ వరకు జరుగుతుంది. ఈ ప్రత్యేక శిబిరాలు గ్రామ, వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయి.చిన్నారులకు ఆధార్ నమోదు చేయించడం చాలా సులభమైన ప్రక్రియ. తల్లిదండ్రులు కేవలం తమ పిల్లల జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకొని శిబిరానికి హాజరైతే సరిపోతుంది. సచివాలయ సిబ్బంది అక్కడ ఉచితంగా ఆధార్ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారు. ఎటువంటి అదనపు పత్రాలు లేదా రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు జనన ధ్రువీకరణ పత్రాలు పొందిన 1.07 లక్షల మంది పిల్లలకు ఇంకా ఆధార్ నమోదు పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రత్యేక శిబిరాల ద్వారా వీలైనంత ఎక్కువ మంది పిల్లలకు ఆధార్ అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఒకవేళ మీ ఆరేళ్ల లోపు పిల్లలకు ఇదివరకే ఆధార్ కార్డు ఉన్నట్లయితే ఆ విషయాన్ని సంబంధిత సచివాలయ సిబ్బందికి తెలియజేయాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనివల్ల డేటా కచ్చితంగా తెలుస్తోంది.

ఆధార్ కార్డు అనేది భారతదేశంలో ఒక ముఖ్యమైన గుర్తింపు పత్రం. ఇది పిల్లలకు అనేక ప్రభుత్వ పథకాలు,సేవలను పొందడానికి అవసరం. ముఖ్యంగా పాఠశాలల్లో ప్రవేశాలు, ఆరోగ్య సంరక్షణ, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను పొందడానికి ఆధార్ తప్పనిసరి. భవిష్యత్తులో కూడా అనేక అవసరాలకు ఇది ఉపయోగపడుతుంది.

ప్రత్యేక శిబిరాల పూర్తి షెడ్యూల్:

మొదటి విడత: మే 5, 6, 7, 8 తేదీలు

రెండవ విడత: మే 12, 13, 14, 15 తేదీలు

ఈ తేదీల్లో మీ సమీపంలోని గ్రామ లేదా వార్డు సచివాలయానికి మీ పిల్లల జనన ధ్రువీకరణ పత్రంతో వెళ్లి ఆధార్ నమోదు చేయించుకోవాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది.

# మళ్లీ టీడీపీ వైపు

విజయవాడ, మే 3, ఆ ఇద్దరు నేతలు తెలుగుదేశం పార్టీలో ఒక వెలుగు వెలిగారు. ఎన్నో కీలక పదవులు అనుభవించారు. కానీ అనుకోని రీతిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ అక్కడ కూడా అనుకున్నంత సక్సెస్ కాలేకపోయారు. కేవలం అప్పటి అధికార వైసీపీ ఒత్తిళ్లకు తలోగ్గి ఆ పార్టీలోకి జంప్ చేశారు. కానీ ఇప్పుడు తిరిగి మాతృ పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ అధినేత చంద్రబాబు నుంచి గ్రీన్ సిగ్నల్ లభించకపోవడంతో వారు పొలిటికల్ సర్కిల్లో నిలబడ్డారు. ఇంతకీ ఎవరా నేతలు? ఏంటా కథ? అంటే వివరాల్లోకి వెళ్దాం.ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయంగా చైతన్యవంతం అయ్యింది. ఈ జిల్లా నుంచి ఎంతోమంది హేమాహేమీలు రాష్ట్ర రాజకీయాలను శాసించారు. అందులో ఒకరు కరణం బలరామకృష్ణ. సుదీర్ఘకాలం టిడిపి నుంచి ఎమ్మెల్యేగా పనిచేసిన బలరామకృష్ణకు మంత్రి పదవి అన్నది దక్కకుండా పోయింది. ప్రకాశం జిల్లా రాజకీయాలను శాసించిన ఈ నేత అమాత్య అని అనిపించుకోలేకపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ లో చేరి ఆ పార్టీ నుంచి మంత్రిగా అవుతానని భావించారు. కానీ అది కూడా సాధ్యం కాలేదు. మరో మాజీ మంత్రి సిద్దా రాఘవరావు ది విచిత్ర పరిస్థితి. 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనను మంత్రివర్గంలోకి తీసుకున్నారు చంద్రబాబు. 2019 ఎన్నికల్లో ఒంగోలు నుంచి ఎంపీగా పోటీ చేయించారు. ఓడిపోవడంతో రాఘవరావు సైతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కేవలం వ్యాపారాలపై ఒత్తిడి పెరగడంతోనే వీరు వైసీపీలో చేరినట్లు ఒక ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు తిరిగి టిడిపిలో చేరేందుకు వీరిద్దరూ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.కరణం బలరాం విషయంలో టిడిపి నుంచి అనేక అభ్యంతరాలు ఉన్నాయి. ఎందుకంటే చీరాల నుంచి టిక్కెట్ ఇచ్చారు చంద్రబాబు. గెలిచిన తర్వాత పార్టీ క్లిష్ట సమయంలో ఉండగా గుడ్ బై చెప్పారు కరణం బలరాం.

అందుకే ఎట్టి పరిస్థితుల్లో కరణం బలరామును పార్టీలో చేర్పించుకోవద్దని చంద్రబాబుపై టిడిపి శ్రేణుల ఒత్తిడి ఉంది. దీంతో చంద్రబాబు సైతం కరణం బలరాం విషయంలో ముఖం మీద చెప్పినట్లు సమాచారం. అయితే ఆయనను జనసేనలో చేర్పించేందుకు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. తన కుమారుడు వెంకటేష్ రాజకీయ భవిష్యత్తు కోసం జనసేనలో చేరేందుకు బలరాం దాదాపు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.మరోవైపు సిద్దా రాఘవరావువిషయంలో మాత్రం టిడిపిలో సానుకూలత వ్యక్తం అవుతోంది. ఆయన తప్పనిసరి పరిస్థితుల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాల్సి వచ్చింది. వాస్తవానికి రాఘవరావుకు అరుదైన అవకాశం ఇచ్చారు చంద్రబాబు. 2014లో గెలవడంతో తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 2019లో ఎంపీగా కూడా పోటీ చేశారు రాఘవరావు. అయితే ఆయనకు గ్రానైట్ తో పాటు ఇతరత్రా వ్యాపారాలు ఉన్నాయి. అప్పటి అధికార వైయస్సార్ కాంగ్రెస్ ఒత్తిడి చేసి రాఘవరావును పార్టీలో చేర్చుకుందని.. తీరా చేర్చుకున్నాక పట్టించుకోకుండా మానేసింది అన్న సానుభూతి ఆయనపై ఉంది. అందుకే రాఘవరావు విషయంలో చంద్రబాబు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. త్వరలో ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడం ఖాయమని ప్రచారం సాగుతోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# హామీలు సరే.. ఆచరణ ఎప్పుడు

హైదరాబాద్,మే 3,తెలంగాణలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉచితాల మీద ఉచితాలు ప్రకటించారు. ఏకంగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సోనియాగాంధీ లాంటి వారిని పిలిపించి డిక్లరేషన్లు ప్రకటించారు. కానీ వాటి అమలులో మాత్రం మీన మేషాలు లెక్కిస్తున్నారు. వాస్తవానికి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో రేవంత్ రెడ్డికి తెలుసు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే నాటి కెసిఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం షాపులు ఏర్పాటు చేసింది. గడువు ముగియకముందే ముందుగానే వైన్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించింది. తద్వారా అప్పటి ఎన్నికల్లో నెగ్గడానికి ప్రణాళికలు రూపొందించింది. కానీ ఆ ఎన్నికల్లో ప్రజలు వేరే విధంగా తీర్పు ఇవ్వడంతో భారత రాష్ట్ర సమితికి తల బొప్పి కట్టింది. ఇక నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చింది. వాటిల్లో కొన్ని మాత్రమే అమలులో పెట్టింది. అమలు ఉన్న పథకాలు కూడా అంతంతమాత్రంగానే ప్రజలకు చేరువవుతున్నాయి. ఇక ఇదే విషయాన్ని ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి ప్రస్తావిస్తే.. కాంగ్రెస్ పార్టీ ఎదురుదాడికి దిగుతోంది. ఇది ఊహించిన పరిణామమే అయినప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సరికొత్త పల్లవి అందుకుంది.ఇటీవల జరిగిన ప్రతి సమావేశంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్నారు. చివరికి ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరితే.. తెలంగాణ ఆర్టీసీ ఇప్పుడిప్పుడే బాగుపడుతోందని.. కార్మికులు సమ్మెకు దిగితే నష్టం తీవ్రంగా వాటిల్లుతుందని వాపోయారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఇప్పుడు ఏమాత్రం బాగోలేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేకపోతున్నామని రేవంత్ రెడ్డి పదేపదే వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగో లేనప్పుడు.. అని హామీలు ఎవరు ఇవ్వమన్నారు? ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించమని ఎవరు చెప్పారు? నాడు అవుటర్ రింగ్ రోడ్డు ను లీజుకు ఇచ్చినప్పుడు రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితిని లెక్కలతో సహా వివరించారు. మరి అధికారంలోకి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు మొత్తం అమలు చేయాలంటే డబ్బులు ఉండాలనే విషయం రేవంత్ రెడ్డికి తెలియదా.. అంటే అధికారం కోసం ఎన్ని హామీలైనా ఇస్తారా? చివరికి ఓట్లు వేయించుకొని ప్రజలను వెర్రివాళ్లను చేస్తారా? అంటూ రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.. ప్రతి సమావేశంలోనూ బడ్జెట్ పద్మనాభం లాగా లెక్కలు వేయడం.. తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పడం.. పరిపాటిగా మారిపోయిందని.. రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీల అమలుపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

# 8న హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభం

హైదరాబాద్, మే 3, భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత, చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుంది హైడ్రా. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం హైడ్రా విభాగానికి మరిన్ని అధికారాలు అప్పగించింది. కొన్ని రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించినట్లుగా.. త్వరలోనే నగరంలో ప్రత్యేక హైడ్రా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. దీనిలో భాగంగా.. ఈ నెల 8న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్‌ను అధికారికంగా ప్రారంభించనున్నారు.హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి రేవంత్ సర్కార్ గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. బుద్ధభవన్‌లోని బీ-బ్లాక్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. అలానే హైడ్రాకి విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం రేవంత్ సర్కార్ ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. హైడ్రా ఏర్పాటుపై ప్రశ్నలు రావడంతో.. సర్కార్ జీహెచ్ఎంసీ చట్టం 1955ను సవరించింది. నగరంలోని జలాశయాలు, ఇతర ఆస్తులను కాపాడేందుకు అధికారిని లేదా సంస్థను ఏర్పాటు చేసే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెడుతూ.. జీహెచ్ఎంసీ చట్టంలో కొత్తగా 374 బి సెక్షన్‌ను చేర్చింది.ఇక త్వరలో ప్రారంభం కానున్న హైడ్రా పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా ఏసీపీ స్థాయి అధికారి ఉండనున్నట్లు సమాచారం. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం అంతా హైడ్రా పోలీసు స్టేషన్ పరిధిలోనికి రానున్నట్లు తెలుస్తుంది. ఓఆర్ఆర్ లోపల ఎక్కడ ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు కబ్జా అయినా.. ఇకపై హైడ్రా పోలీసు స్టేషన్‌లోనే కేసులు నమోదు చేయనున్నారు.హైడ్రా పోలీస్ స్టేషన్ రాకతో.. ఇకపై నగరంలో.. చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల వ్యవహారంలో జరిగే అక్రమ ఆక్రమణలపై స్థానికులు, అధికారులు నేరుగా హైడ్రా పోలీస్ స్టేషన్‌లోనే ఫిర్యాదు చేయవచ్చు. ఇప్పటివరకు సాధారణ పోలీస్ స్టేషన్లలో నమోదైన భూకబ్జా కేసులపై హైడ్రా దాడులు జరుపుతూ వస్తోంది. అయితే త్వరలోనే ఈ కేసులు సాధారణ పోలీసు స్టేషన్ల నుంచి హైడ్రా స్టేషన్‌కు బదిలీ అయ్యే అవకాశం ఉంది. హైడ్రా పోలీసు స్టేషన్ వల్ల ఈ కేసులు తర్వగా పరిష్కారం

# కేబినెట్ రేసులో విజయశాంతి



హైదరాబాద్,మే 3, తెలంగాణ క్యాబినేట్ విస్తరణ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ కోల్డ్ స్టోరేజీలో పెట్టినా..నేతల ప్రయత్నాలు మాత్రం ఆగడం లేదు. ఎవరికి వారు ఆ అమాత్య పదవి కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా చట్టసభల్లో అడుగు పెట్టిన నేతలు సైతం మంత్రి పదవి కోసం తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు తెంగాణ కాంగ్రెస్ లో చర్చంతా తాజా ఎమ్మెల్సీ విజయశాంతి గురించే జరుగుతోంది. నెల రోజుల క్రితం పెద్దల సభ శాసనమండలిలో అడుగు పెట్టిన ఆమె..మంత్రి పదవిపై కన్నేశారన్న టాక్ విన్పిస్తోంది. ఎలాగైనా క్యాబినేట్లో స్థానం దక్కించుకోవాలని గట్టి పట్టుదలతో ఉన్నారట.తెలంగాణ కేబినెట్ లో ప్రస్తుతం సామాజిక సమీకరణాలు కొలిక్కి రాకపోవడంతో విస్తరణ అంశం వాయిదా పడింది. క్యాబినేట్ కూర్పులో ఖచ్చితంగా సామాజిక సమతుల్యం పాటించాలని పార్టీ హైకమాండ్ భావిస్తోంది. ఇదే అవకాశాన్ని అదునుగా భావిస్తున్న విజయశాంతి..అదే అస్త్రాన్ని సందిస్తున్నారు. తెలంగాణలో బీసీలలో బలమైన సామాజికవర్గమైన ముదిరాజ్ వర్గానికి క్యాబినేట్ ఛాన్స్ ఇవ్వాలని గట్టి పట్టుదలతో ఉన్నారు.భాగంగా అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ ఒక్కరు మాత్రమే ఆ సామాజికవర్గానికి చెందిన వారు ఉన్నారు. క్యాబినేట్ విస్తరణ జరిగితే ఆయనకే పక్కా ఛాన్స్ అని అంతా భావించారు. కానీ ఇప్పుడు ఆల్ ఆఫ్ సడెన్గా రేసులోకి విజయశాంతి వచ్చారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ ఈక్వేషన్స్ తో పెద్దల సభలోకి విజయశాంతి అడుగు పెట్టారు. ఎమ్మెల్సీ అయినప్పటి నుంచి ఆమె క్యాబినేట్ లో చోటు కోసం కసరత్తు చేస్తున్నారు. అయితే అందుకోసం సామాజిక సమీకరణాల్లో భాగంగా విజయశాంతి కూడా ఇప్పుడు ముదిరాజ్ కోటాను ప్రస్తావిస్తోంది.చాలా కాలంగా రాజకీయాల్లో ఉంటున్నా.. ఇప్పటి వరకు ఏనాడు కూడా కులం అంశాన్ని ప్రస్తావించ లేదు. గతంలో మెదక్ నుంచి ఎంపీగా పోటీ చేసినప్పుడు కులం కాలమ్ లో ఏ కులం పేరును ప్రస్తావించలేదు. ఆ తర్వాత ఎప్పుడూ కూడా ఆమె ఏ సామాజికవర్గం అనేది స్పష్టత ఇవ్వలేదు. కానీ ఇప్పుడు ఆల్ ఆఫ్ సడెన్గా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా విజయశాంతి బీసీ వర్గంగా చెప్పుకున్నారు. ఇందులో ముదిరాజ్ సామాజికవర్గంలో అంతర్భాగంగా ఉన్న ఓ వర్గం తనదంటూ..ఆ కోటాలో తనకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని ఆమె కోరుతున్నారట.మొత్తం మీద తెలంగాణ రాజకీయాల్లో చాలా కాలంగా స్తబ్ధుగా ఉన్న విజయశాంతి ఒక్కసారిగా ఎమ్మెల్సీ పదవితో యాక్టివ్ పాలిటిక్స్ లోకి వచ్చారు. ఇప్పుడు ఏకంగా ముదిరాజ్ కోటాలో మంత్రిపదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే విజయశాంతి చేస్తున్న ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయనేది వేచి చూడాలి. ఆమె కోరుతున్నట్లు మంత్రివర్గంలో ఛాన్స్ ఇస్తారా లేదా అన్నది రానున్న రోజుల్లో తేలిపోనుంది.

# దోస్త్.. నోటిఫికేషన్ రెడీ

హైదరాబాద్, మే 3, తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో 2025-25 విద్యాసంవత్సరం ప్రవేశాలకు సంబంధించి దోస్త్ నోటిఫికేషన్ మే 2న వెలువడింది. జూన్ 23 వరకు మొత్తం మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగనుంది. విద్యార్థులు మొదటి విడతలో రూ.200 చెల్లించాలి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇక రెండు, మూడో విడతల్లో రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.ప్రకటించిన షెడ్యూలు ప్రకారం.. 21 వరకు మొదటి విడత రిజిస్ట్రేషన్లు నిర్వహించి, మే 10 నుంచి 22 వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఇవ్వనున్నారు. విద్యార్థులకు మే 29న సీట్లను కేటాయించనున్నారు. అదేవిధంగా మే 30 నుంచి జూన్ 8 వరకు రెండో విడత రిజిస్ట్రేషన్లు నిర్వహించి, మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పించనున్నారు. రెండో విడత సీట్లను జూన్ 13న కేటాయించనున్నారు. ఇక చివరి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియను జూన్ 13 నుంచి 19 వరకు నిర్వహించి.. జూన్ 13 నుంచి 19 మధ్య వెబ్‌ఆప్షన్లు నమోదుచేసుకోవచ్చు. వీరికి జూన్ 23న సీట్లను కేటాయించనున్నారు. ప్రవేశాల ప్రక్రియ పూర్తయిన తర్వాత జూన్ 30 నుంచి డిగ్రీ కాలేజీల్లో తరగతులు ప్రారంభంకానున్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం 'దోస్త్' ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గత విద్యాసంవత్సరానికి సంబంధించి 'దోస్త్' ప్రవేశాల పరిధిలో రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలో 1054 డిగ్రీ కాలేజీలుండగా, వాటిలో 136 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, నాన్ దోస్త్ కాలేజీలు 63 ఉన్నాయి. మిగిలినవి ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 3,86,544 డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీబీఎం, బీసీఏ తదితర కోర్సుల్లోని సీట్లను దోస్త్ ద్వారా భర్తీచేస్తారు.

దోస్త్ 2025 షెడ్యూలు..

మొత్తం మూడు విడతల్లో డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ చేపట్టనున్నారు. డిగ్రీలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం హానర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీబీఎం, బీసీఏతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

మొదటి దశ ప్రవేశాలు ఇలా..

? మే 3 నుంచి 21 వరకు దోస్త్ మొదటి విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించనున్నారు.

? రిజిస్ట్రేషన్ పూర్తిచేసిన విద్యార్థులకు మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించనున్నారు.

? విద్యార్థులకు మే 29న మొదటి విడత డిగ్రీ సీట్లను కేటాయించనున్నారు.

రెండో దశ ప్రవేశాలు ఇలా..

? రెండో విడత దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మే 30 నుంచి జూన్ 8 వరకు కొనసాగనుంది.

? రెండో విడత వెబ్ ఆప్షన్లకు మే 30 నుంచి జూన్ 9 వరకు అవకాశం కల్పించనున్నారు.

? విద్యార్థులకు జూన్ 13న రెండో విడత డిగ్రీ సీట్లను కేటాయిస్తారు.

మూడో విడత ప్రవేశాలు ఇలా..

? దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ జూన్ 13న ప్రారంభంకానుంది.

? విద్యార్థులు జూన్ 19 వరకు దరఖాస్తులు సమర్పించాలి.

? చివరి విడత వెబ్ ఆప్షన్లకు జూన్ 13 నుంచి 19 వరకు నిర్వహించనున్నారు.

? విద్యార్థులకు జూన్ 23న మూడో విడత డిగ్రీ సీట్లను కేటాయిస్తారు.

? జూన్ 30 నుంచి కళాశాలల్లో తరగతులు ప్రారంభంకానున్నాయి.

# ఈ మామిడి కాయల కోసం బౌన్సర్లు...

ఖమ్మం, మే 3, కిలో మామిడి పండ్ల రేటు ఎంత ఉంటుంది..? రూ.200 లేదా రూ.300 రూపాయలు ఉంటుంది. కానీ ఒక్కసారి ఊహించుకోండి... ఒక కిలో మామిడి పండ్ల ధర అక్షరాలా మూడు లక్షల రూపాయలు.. పలుకుతోంది. వినడానికి ఎంతో ఆశ్చర్యంగా ఉంది కదూ? అంత పెద్ద మొత్తంలో ధర పలకడానికి ఆ మామిడి పండ్లలో అంత ప్రత్యేకత ఏముందో తెలుసుకోవాలని ఉందా..? అయితే దీనిని మీరు కచ్చితంగా తెలుసుకోవాల్సిందే.. ఆ అరుదైన మామిడి పండ్లనే 'మియాజాకీ' అంటారు. వాటికున్న డిమాండ్‌ను బట్టి ధర ఒక్కోసారి కిలో మూడు లక్షల రూపాయల వరకు పలుకుతుంది.ఈ అద్భుతమైన విషయాన్ని తెలుసుకున్న ఖమ్మం నగరానికి చెందిన ఓ రైతు కరోనా లాక్‌డౌన్ సమయంలో ఒక ఆసక్తికరమైన ఆలోచన చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఇంత డిమాండ్ ఉన్న ఈ మామిడిని మన నేలపై పండిస్తే ఎలా ఉంటుందని ఆలోచించి వెంటనే రంగంలోకి దిగారు. మధ్యవర్తుల ద్వారా కాలిఫోర్నియా నుండి ఒక్కో మొక్కను అక్షరాలా 12 వేల రూపాయలు వెచ్చించి మరీ 30 మొక్కలను దిగుమతి చేసుకున్నాడు. 2020లో నాటిన ఈ మొక్కలు ఇప్పుడు బంగారు పంటను పండిస్తున్నాయి.ఆ రైతు చెప్పిన వివరాల ప్రకారం.. ఒక్కో చెట్టుకు 2024లో 30 కాయలు కాగా, 2025లో ఏకంగా 80 కాయలు కాశాయి. ఒక్కో కాయ బరువు దాదాపు 500 గ్రాములు ఉంటుందట.. ఇతర మామిడి రకాల కంటే ఇది నెల ముందుగానే పూత, కాతకు రావడం మరో విశేషం. ఇక్కడి నేల ఈ పంటకు అనుకూలంగా ఉండటంతో.. రెండేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని కడియం నర్సరీ నుండి ఒక్కో మొక్కను 3,500 రూపాయల చొప్పున మరో 120 మొక్కలను కూడా కొనుగోలు చేశారు. అదనంగా మరో ఎకరం విస్తీర్ణంలో ఈ సాగు చేపట్టగా, ప్రస్తుతం వచ్చిన పండ్లను కేవలం కుటుంబ అవసరాల కోసం మాత్రమే ఉపయోగిస్తున్నట్లు ఆయన తెలిపారు. మిగిలిన పంటను త్వరలోనే మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నాడు.

మియాజాకీ మామిడి రకాన్ని పండిస్తోన్న కాకినాడ రైతు.. కేజీ రూ.2.7 లక్షలుజిల్లా ఉద్యాన అధికారులు ఈ అరుదైన మామిడి రకం గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. ప్రతి సంవత్సరం నవంబర్ నుండి డిసెంబర్ మధ్యలో ఈ తోట పూతకు వస్తుందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ పండ్ల ధర కిలో 2.50 లక్షల నుండి 3 లక్షల రూపాయల వరకు పలుకుతాయన్నారు. రాష్ట్రంలో బహుశా ఈ ఒక్క రైతు మాత్రమే ఈ రకం మామిడిని సాగు చేస్తున్నారని భావిస్తున్నారు.

ఈ రకమైన మామిడి రసం పీల్చే పురుగులు (తామర పురుగులు, నల్లి) మరియు ఆకుమచ్చ వంటి తెగుళ్లకు త్వరగా గురవుతుంది. ఈ పండ్లకు ఇంత అధిక ధర ఉండటానికి ప్రధాన కారణం వాటి ప్రత్యేకమైన రుచి, క్రీమీ ఆకృతి.. పరిమిత ఉత్పత్తి. ఇవి ముదురు ఎరుపు లేదా ఊదా రంగులో ఉండి చాలా తియ్యగా ఉంటాయి. అంతేకాదు.. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు (సి, ఇ, ఎ, కె).. ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి.మియాజాకీ మామిడి రకం మొట్టమొదటగా 1984లో జపాన్‌లోని మియాజాకి ప్రాంతంలో పండించబడింది. అందుకే దీనికి ఆ పేరు వచ్చింది. ప్రస్తుతం జపాన్‌లోనే వీటిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. మన దేశంలో కూడా పంజాబ్‌కు చెందిన ఒక రైతు ఈ రకం మామిడిని సాగు చేసి, వాటి భద్రత కోసం బౌన్సర్లను నియమించిన విషయం సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి మీకు గుర్తుందే ఉంటుంది.

# 85 కిలోమీటర్ల కు మెట్రో డీపీఆర్ రెడీ



హైదరాబాద్, మే 3,హైదరాబాద్ మెట్రో రెండో దశ 'బి' భాగంగా జేబీఎస్ నుండి మేడ్చల్ (24 కి.మీ.), జేబీఎస్ నుండి శామీర్‌పేట (21 కి.మీ.), శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ (40 కి.మీ.) వరకు మూడు కీలకమైన మెట్రో మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. ఆమోదం తర్వాత రాష్ట్ర మంత్రివర్గం చర్చించి కేంద్రానికి పంపుతుంది. జేబీఎస్ వద్ద ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌ను అభివృద్ధి చేయాలని కూడా ప్రతిపాదన ఉంది.. దీని రూపకల్పన జపాన్‌లోని రవాణా వ్యవస్థను స్ఫూర్తిగా తీసుకుంటుంది.హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ తన రెండో దశ విస్తరణకు వేగంగా అడుగులు వేస్తోంది. రెండో దశ 'బి'లో భాగంగా ప్రతిపాదించిన కీలకమైన మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. ఈ డీపీఆర్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ బోర్డు ఆమోదించాల్సి ఉంది. బోర్డు ఆమోదం తర్వాత.. రాష్ట్ర మంత్రివర్గం దీనిపై చర్చించి ఆమోదం తెలుపుతుంది. అనంతరం.. తుది అనుమతి కోసం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపుతారు.రెండో దశ 'బి'లో హైదరాబాద్ నగరంలోని ఉత్తర ప్రాంతాలకు మెట్రో అనుసంధానాన్ని విస్తరించేందుకు ముఖ్యమైన ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) నుండి మేడ్చల్ వరకు 24 కిలోమీటర్ల మేర ఒక మార్గం, అలాగే జేబీఎస్ నుండి శామీర్‌పేట వరకు 21 కిలోమీటర్ల మేర మరొక మార్గం ప్రతిపాదించబడ్డాయి. వీటితో పాటు.. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు దాదాపు 40 కిలోమీటర్ల పొడవైన మెట్రో మార్గం యొక్క డీపీఆర్‌ను కూడా సిద్ధం చేశారు.విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీకి వెళ్లే మెట్రో మార్గం ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ నుండి ప్రారంభమై.. కొత్తగా ప్రతిపాదించిన మెట్రో రైలు డిపో పక్కనుంచి.. విమానాశ్రయ సరిహద్దు గోడ వెంబడి ఆకాశ మార్గంలో కొనసాగుతుంది. ఇది మాన్సాన్‌పల్లి, బహదూర్‌గూడ, పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎగ్జిట్, తుక్కుగూడ ఎగ్జిట్, రావిర్యాల్ ఎగ్జిట్ వరకు సర్వీస్ రోడ్డులో వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. అక్కడి నుండి, ప్రభుత్వం కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రహదారి ద్వారా కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచలూరు, గుమ్మడవెల్లి, పంజగూడ , మీర్‌ఖాన్‌పేట వరకు దాదాపు 22 కిలోమీటర్ల మేర ఈ మార్గం విస్తరించనుంది.ఈ డీపీఆర్‌ను మొదట హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) బోర్డు ఆమోదించాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ బోర్డుకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో ఎండీతో పాటు పురపాలక, పట్టణాభివృద్ధి, ఆర్థిక, పరిశ్రమలు, ఐటీ శాఖల కార్యదర్శులు మరియు హెచ్ఎండీఏ కమిషనర్ డైరెక్టర్లుగా ఉంటారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు.. జేబీఎస్ వద్ద 30 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రితో పాటు జపాన్ పర్యటనకు వెళ్లిన మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, అక్కడి అనుభవాలను ఈ మెట్రో హబ్‌లో పొందుపరిచేందుకు కృషి చేస్తున్నారు. జపాన్‌లో బుల్లెట్ రైళ్లు, మెట్రో , సాధారణ రైలు సదుపాయాలు ఒకదానితో మరొకటి అనుసంధానించబడి ఉంటాయి. ప్రయాణికులు ఒక రైలు నుండి మరొక రైలుకు సులభంగా మారేలా ఈ వ్యవస్థ రూపొందించబడింది. ఇదే తరహా అనుసంధాన వ్యవస్థను జేబీఎస్ మెట్రో హబ్‌లో కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు.

వివరాలు పంపించండి... కిషన్ వినతి

నగరంలో మెట్రోరైలు విస్తరణ కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశించారు. కేంద్రమంత్రి ఆధ్వర్యం లో శుక్రవారం ఎంసీహెచ్ హెచ్ఆర్డీలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. కేంద్రనిధులతో జరుగుతున్న కార్యక్రమాలపై కేంద్రమంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వ హించారు.మెట్రోరైలు ప్రాజెక్టులో అఫ్జల్‌గంజ్ వరకే పరిమితమైన ఫస్ట్ ఫేజ్ ను విస్తరించి..సెకండ్, థర్డ్, ఫోర్త్ ఫేజ్‌ల కోసం ప్రతిపాదనలు వెంటనే కేంద్రప్రభుత్వానికి పంపించాలని సూచిస్తున్నట్లు తెలిపారు. మెట్రోరైలు వివరాలు అందితే కేంద్రప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు, రుణాలు లభించేలా సహకరిస్తామని స్పష్టం చేశారు.రాష్ట్ర అభివృద్ధిలో మొదట ప్రతిబింబించేది హైదరాబాద్ సిటీ అని.. అభివృద్ధి అంటే కేవలం హైటె క్ సిటీ కాదని.. ఓల్డ్ సిటీ, గౌలిగూడ, అం బర్‌పేట్, సనత్‌నగర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలూ కీలకమని అన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, పాతబస్తీ ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, ప్రాథమిక సౌకర్యాల సమస్యలు మరింతగా తలెత్తుతున్నాయని..హైటెక్ సిటీతో పా టు ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై సమాన దృష్టితో ముందు కు సాగాల్సిన అవసరం ఉందన్నారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ సంస్థలు నగర మౌలిక వసతుల కల్పనలో కీలకపాత్ర పోషిస్తున్నాయని, నిధుల కొరత లేకుండా చూ సేందుకు చర్యలు తీసుకోవాలన్నా రు. జీహెచ్ఎంసీ ఊహించని స్థాయి లో విస్తరిస్తూ జనాభా భారీగా పెరుగుతున్న నేప థ్యంలో మౌలికవ సతులపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టే పథకాలకు రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను కేటాయించకపోవడం వల్లే నిధులు ఖర్చు చేయ లేని దుస్థితి ఏర్పడుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. అధికారులు రాష్ట్రంలోని సమస్యలను తమ దృష్టి కి తీసుకువస్తే కేంద్రం నుంచి ఎన్ని నిధులైె నా తీసుకువస్తామని తెలిపారు.

## సిటిజన్ కానిస్టేబుల్స్...

హైదరాబాద్, మే 3 రాంగ్‌రూట్‌లో వెళ్తే ట్రాఫిక్ పోలీస్ ఫోటో కొట్టి ఫైన్ వేయడం మనకు తెలిసిన విషయమే. అయితే ఎక్కడైనా ట్రాఫిక్ పోలీస్ లేదని తెలిస్తే మాత్రం వాహనదారులు మొత్తం ఇష్టం వచ్చినట్లు వెళ్తూ ఉంటారు. రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు కారణమైన వారిని మనం నిత్యం చూస్తూనే ఉంటాం. అందుకే ఇప్పుడు ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్ తీసుకువచ్చారు. రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనదారులను ఎవరైనా ఫోటో తీసి పంపిస్తే.. అలాంటి వారికి జరిమానాలు వేసే నిర్ణయం తాజాగా అమల్లోకి వచ్చింది.హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ వాహనాలు పెరిగిపోతూనే ఉన్నాయి. అదే సమయంలో ట్రాఫిక్ కూడా నిత్యం పెరుగుతూనే ఉంది. ఇక ట్రాఫిక్ ఉల్లంఘించి వెళ్లే వాహనదారుల సంఖ్య కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. దీంతో ఎక్కడికక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు.. అందులో రాంగ్ రూట్ కారణంగా జరిగే ప్రమాదాలు, మరణాల సంఖ్య ఎక్కువగా ఉండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు.. రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనదారుల భరతం పట్టేందుకు సిద్ధం అయ్యారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వెళ్తే వారికి జేబులు చిల్లులు పడేలా ఫైన్లు వేస్తున్నారు. అయితే ఇదంతా ట్రాఫిక్ పోలీసులు ఉండే జంక్షన్ల మాత్రమే ఇప్పటివరకు ఉండేది. కానీ ఇక నుంచి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి రాంగ్ రూట్ డ్రైవింగ్ లేకుండా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.ఇందులో భాగంగానే ట్రాఫిక్ పోలీస్ లేని ప్రాంతాల్లో రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనదారుల ఫోటోలు తీసే అధికారాన్ని సాధారణ ప్రజలకు, వాహనదారులకు కల్పించారు. ఎవరైనా రాంగ్ రూట్‌లో వెళ్లినట్లు గమనిస్తే.. వారి వాహనం ఫోటో తీసి తమకు పంపిస్తే.. అలాంటి వారికి ఫైన్లు విధిస్తామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కొత్త రూల్ తీసుకువచ్చారు. ఈ క్రమంలోనే సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ఆసక్తికరమైన ట్వీట్ పెట్టారు. ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించి రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాల ఫోటోలు, వీడియోలు తీసి పంపాలని విజ్ఞప్తి చేశారు. అలాంటి ఫోటోలు వీడియోలను తమ వాట్సాప్ నెంబర్ 9490617346కు పంపించాలని.. వాటితోపాటు ఆ వాహనం లొకేషన్, టైమ్, డేట్ వంటి పూర్తి వివరాలను పంపించాలని ట్వీట్‌లో సూచించారు.పంపిన వివరాలను సేకరించి.. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించి.. రాంగ్ రూట్‌లో వెళ్లిన వాహనదారులకు జరిమానాలు విధించి.. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ముక్కుపిండి వసూలు చేయనున్నారు. మే 1వ తేదీ నుంచే ఈ కొత్త నిబంధన అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. రాంగ్ రూట్‌లో వాహనదారులు ప్రయాణాలు చేయకుండా ఉండేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తీసుకువచ్చిన ఈ రూల్‌కు సంబంధించిన ట్వీట్‌కు నెటిజన్లు మద్దతు తెలుపుతూ రీట్వీట్లు, కామెంట్లు చేస్తున్నారు.

## అడ్డగోలు నిర్మాణాలు...

హైదరాబాద్, మే 3, భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిని కేటాయించి ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేలా ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు ఇదే అదనుగా భావించి సర్కారు భూమిలో వాణిజ్య దుకాణాలను, భవనాలను ఏర్పాటు చేసుకొని దర్జాగా లబ్ధిపొందుతున్నారు.. దీనిని నివారించాల్సిన గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు మామూళ్ళ మత్తులో ఊగిపోతూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు...పైగా రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయంటూ అధికారులను బెదిరిస్తూ దర్జాగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా సర్కారు భూమిలో వాణిజ్య దుకాణాలు, భవనాన్ని ఏర్పాటు చేసుకున్నారు.ఇదేమిటని అడిగే నాథుడు లేకపోవడంతో వారు అడిందే ఆట పాడిందే పాటలా కొనసాగుతోంది. వివరాల్లోకి వెళ్తే..కొండాపూర్ మండలం సీహెచ్ కోనాపూర్ గ్రామ శివారులోని గేట్ వద్ద సర్వే నం బర్ 54లో గల ప్రభుత్వ భూమిని గతంలో వీరేశం యాదవ్ అనే వ్యక్తికి సాగు చేసుకోవడానికి కొంత భూమిని కేటాయించారు. కాగా గత నాలుగైదు సంవత్సరాల క్రితం సదరు లబ్దిదారుడు ఆ భూమిని సాగు చేయకుండా ఆ స్థలంలో ఎలాంటి అనుమతి లేకుండా భవనం నిర్మించుకున్నారు.అంతేగాకుండా రేకులతో వాణిజ్య దుకాణాలను ఏర్పాటు చేసి కిరాయికి ఇవ్వడం జరిగింది. ఈ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు కూడా తీసుకోకుండా తనను అడిగేవారు లేరంటూ దర్జాగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇందుకు తగ్గట్టు సంబంధిత అధికా రులు సైతం అతనికే వత్తాసు పలకడంతో అడ్డూఅదుపు లేకుండా పోయింది. ప్రభుత్వం కేటాయించిన భూమిలో కేవ లం సాగు మాత్రమే చేసుకోవాలనేది నిబంధన. ఒకవేళ లబ్దిదారుడు సాగు చేసుకోని పక్షంలో ఆ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీ నం చేసుకోవాలి. కానీ ఇక్కడ అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో సద రు లబ్దిదారుడు దర్జాగా భవనాన్ని నిర్మించడమే కాకుండా వాణిజ్య దుకాణాలను కూడా ఏర్పాటు చేసుకొని కావల్సినంత రాబడి పొందుతున్నాడు.ప్రభుత్వ భూమి లో యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడలేదు. ఎందుకని ఆరా తీస్తే కిందిస్థాయి నుండి ఎమ్మెల్యే వరకు అండదండలు ఉన్నాయని అధికారులే చెప్ప డం విశేషం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన అతనిపై చర్యలు తీసుకోక పోవడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదుపంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పంచాయతీ అధికారులు ఎందుకు చర్యలు తీసు కోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు మామూళ్ళకు తలొగ్గి అక్రమ నిర్మా ణాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు నేరం..

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేసినట్లు మా దృష్టికి రాలేదు. తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. అయినా ప్ర భుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టడం నేరం. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు, వ్యాపారం చేసిన వారిపై తగు చర్యలు తీసుకుంటాంనోటీసులు జారీ చేస్తాం సర్వే నంబర్ 54లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన విషయంలో విచారణ చేపడుతున్నాం. వీరేశం యాదవ్కు నోటీసులు జారీ చేస్తాం. ఎవరైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామంటున్నారు అధికారులు

## ఏలూరు జిల్లాలో హైవేపై బోల్తా పడిన ట్రావెల్స్ బస్సు

ఏలూరు ద్వారకాతిరుమల మండలం గుండంపల్లి వద్ద ప్రవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. హైదరాబాదు నుంచి శ్రీకాకుళం లోని పాత పట్టణానికి ట్రావెల్స్ బస్సు వెళుతోంది. ఘటన సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు వున్నారు. ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

## నేడు అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది దినోత్సవం

అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బందిని అంతర్జాతీయంగా వారి సేవకు గౌరవించటానికి, సేవలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందిని స్మరించుకోవడానికి మరియు సెప్టెంబర్ 11 దాడులలో మరణించిన అగ్నిమాపక సిబ్బందిని స్మరించుకోవడానికి మే 4 న అంతర్జాతీయ అగ్నిమాపక దినోత్సవం జరుపుకుంటారు . 2 డిసెంబర్ 1998న ఆస్ట్రేలియాలో బుష్‌ఫైర్‌తో పోరాడుతున్న ఐదుగురు అగ్నిమాపక సిబ్బంది మరణించిన తర్వాత, జనవరి 4, 1999న ఆస్ట్రేలియన్ అగ్నిమాపక సిబ్బంది, జేజే ఎడ్మండ్‌సన్ చేసిన ప్రతిపాదన తర్వాత ఇది స్థాపించబడింది .డిసెంబరు 2 , 1998న, ఆస్ట్రేలియాలోని విక్టోరియాలోని లింటన్ నుండి అడవి మంటలతో పోరాడుతున్న ఇతర అగ్నిమాపక సిబ్బంది సహాయం కోసం గీలాంగ్ వెస్ట్ ఫైర్ బ్రిగేడ్ యొక్క అగ్నిమాపక సిబ్బంది ప్రతిస్పందించారు . వాటర్ ట్యాంక్‌ను రీఫిల్ చేయడానికి మార్గంలో ఉన్న చలి కారణంగా గాలి దిశలో అకస్మాత్తుగా మార్పు రావడంతో అగ్నిమాపక ట్రక్‌లో మంటలు చెలరేగాయి. ఫలితంగా, ఐదు గీలాంగ్ వెస్ట్ అగ్నిమాపక సిబ్బంది మరణించారు: గ్యారీ వ్రెడెవెల్ట్, క్రిస్టోఫర్ ఎవాన్స్, స్టువర్ట్ డేవిడ్సన్, జాసన్ థామస్ మరియు మాథ్యూ ఆర్మ్‌స్ట్రాంగ్. ఈ సంఘటన చివరికి అంతర్జాతీయ అగ్నిమాపక దినోత్సవం కోసం ప్రతిపాదనకు దారితీసింది.

అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది దినోత్సవంలో భాగంగా మే మొదటి ఆదివారం నాడు స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం "సౌండ్ ఆఫ్" జరుగుతుంది . ఇందులో 30 సెకన్ల పాటు ఫైర్ సైరన్‌లను ఆన్ చేయడం మరియు విధి నిర్వహణలో మరణించిన అగ్నిమాపక సిబ్బంది అందరినీ స్మరించుకోవడానికి ఒక నిమిషం పాటు మౌనం పాటించడం ఉంటుంది. సౌండ్ ఆఫ్ 2002లో ప్రారంభమైంది మరియు ఏటా కొనసాగుతుంది.

అగ్ని నివారణ మరియు మరింత ఇంటెన్సివ్ మరియు క్షుణ్ణంగా శిక్షణ అవసరం అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది దినోత్సవం ద్వారా ప్రచారం చేయబడుతుంది మరియు నైపుణ్యాలు మరియు అవగాహన రెండింటినీ పెంచడానికి ఈ రోజు ఒక ముఖ్యమైన అవకాశంగా పరిగణించబడుతుంది .

ఎరుపు మరియు నీలం రంగు రిబ్బన్ అనేది అంతర్జాతీయ అగ్నిమాపక సిబ్బంది దినోత్సవం కోసం ఉపయోగించే చిహ్నం, రిబ్బన్ 5 సెం.మీ (2 అంగుళాలు) పొడవు మరియు 1 సెం.మీ (0.39 అంగుళాలు) వెడల్పు, రెండు వేర్వేరు రంగులు పైభాగంలో కలిసి ఉంటాయి. రిబ్బన్ యొక్క ఎరుపు అగ్నిని సూచిస్తుంది, అయితే నీలం నీటిని సూచిస్తుంది. రిబ్బన్ సాంప్రదాయకంగా ఒడిలో ధరిస్తారు కానీ లాపెల్‌కు మాత్రమే పరిమితం కాదు.

## గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలనే డిమాండ్ తో రెండో రోజు కొనసాగుతున్న మన్యం బంద్

గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని, ఏజెన్సీలోని ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ స్థానిక ఎస్టీ అభ్యర్థులతో మాత్రమే భర్తీ చేయాలనే డిమాండ్ చేస్తూ 'స్పెషల్ డీఎస్సీ సాధన సమితి' తలపెట్టిన మన్యం బంద్ రెండో రోజు కొనసాగుతోంది. గిరిజన ప్రాంతంలోని టీచర్ పోస్టులను ఇతరులతో భర్తీ చేయవద్దని డిమాండ్ చేస్తూ గిరిజనులు స్వచ్ఛందంగా బంద్ పాటించి, తమ నిరసనను బలంగా వినిపించారు.

గత ఎన్నికల్లో అరకు ప్రచార సభలో నారా చంద్రబాబునాయుడు జివో నెంబర్ 3 పునరుద్ధరణ చేసి 100% ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆదివాసి యువతి యువకులకు ఇచ్చినా హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.మన్యం బంద్ కారణంగా ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితం అయ్యాయి. ప్రైవేటు జీపులు, ఆటోలను ఆందోళనకారులు ఎక్కడికక్కడ నిలిపేశారు. పాడేరులో దుకాణాలు, హోటళ్లు, ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు మూతపడ్డాయి. జనం సైతం ఇళ్లకే పరిమితం కావడంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం జనంతో రద్దీగా ఉండే అంబేద్కర్ కూడలి, మెయిన్ రోడ్లు బోసిపోయాయి.

## అమరావతి పనుల పునప్రారంభ కార్యక్రమం విజయవంతం పై ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు, భాగస్వామ్య పక్షాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు, అభినందనలు

ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగిన రాజధాని అమరావతి పనుల పున: ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను. ప్రజల సహకారంతో, కేంద్ర మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తాం. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి.... మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం అని తెలుపుతూ...ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు..

## గుర్రాల గడ్డలో కార్డన్ అండ్ సెర్చ్



కడప వన్ టౌన్ పరిధిలోని గుర్రాల గడ్డ, బ్రాహ్మణ వీధి లో పోలీసులు శనివారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

అనుమానిత వ్యక్తుల ఇళ్లలో కడప వన్ టౌన్ సి.ఐ బి. రామకృష్ణ, ఎస్.ఐ లు అమర్ నాథ్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, తాలూకా ఎస్.ఐ తులసి నాగ ప్రసాద్, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. .తనిఖీల్లో రికార్డులు లేని 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# లెక్కలు తేలతాయా....

జనాభా లెక్కలతోపాటే దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయానికి రావడం ఎంతైనా ముదావహం. సామాజిక విలువలు, ప్రయోజనాలను కాపాడటానికే ఈ కులగణన నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెప్పింది. అయితే, రాహుల్‌గాంధీ రెండేళ్లనుంచి ఎత్తుకున్న ఓబీసీ ఎజెండాను దెబ్బతీసే రాజకీయ ఎజెండాలో భాగంగానే ప్రభుత్వం ఈ అంశానికి ఆమోదముద్ర వేసిందనే విషయం సూక్ష్మంగా పరిశీలిస్తే అర్థమవుతుంది. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాల ప్రకటన సందర్భంగా కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ కులగణనను కాంగ్రెస్ మొదటినుంచి వ్యతిరేకించిందని చెప్పారు.కాంగ్రెస్‌సహా దాని మిత్రపక్షాలు ఈ అంశాన్ని రాజకీయ కోణంలోనే చూశాయని మండిపడ్డారు. దీనిద్వారా ఓబీసీలపై కాంగ్రెస్ కపటప్రేమ చూపిస్తుందనే భావనను కేంద్రమంత్రి ఆయా వర్గాల్లో కలిగించే ప్రయత్నం చేసినట్టు తెలుస్తున్నది. నిజానికి ఓబీసీ ప్రజల విశ్వాసాన్ని కాంగ్రెస్ కోల్పోయిన విషయాన్ని రాహుల్‌గాంధీ గుర్తించారు. తిరిగి వాళ్ల అభిమానాన్ని చూరగొనేందుకు కృషి చేయాలని పార్టీ నేతలకు సూచించారు. ఈ తరుణంలోనే భారత్ జోడో యాత్ర సందర్భంగా కులగణన అంశాన్ని లేవనెత్తారు.2019 సాధారణ ఎన్నికల్లో కేవలం 50 సీట్లకే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ 2024 నాటికి 99 సీట్లను కైవసం చేసుకుంది. దీనికితోడు తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చింది. ఈ పరిణామాలన్నీ హస్తం పార్టీ నేతలు కులగణన మంత్రం పని చేస్తుందన్న నిర్ణయానికి వచ్చేలా చేశాయి. అందువల్లే పార్లమెంట్‌లో దీనిపై రాహుల్‌గాంధీ తన గళాన్ని రెట్టింపు చేసి, బీజేపీని ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన కులగణనను ఓబీసీలపట్ల తమకున్న అంకితభావానికి నిదర్శనంగా పేర్కొన్నారు. ఈ పరిణామాలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలించిన బీజేపీ పెద్దలు జనగణనలో భాగంగా కులగణన చేసేందుకు అంగీకరించారు. దీంతో కాంగ్రెస్ దగ్గర ఉన్న ఒక్కగానొక్క అస్త్రాన్ని లాక్కున్నట్టయ్యింది.బీజేపీ ఓబీసీల రిజర్వేషన్ విషయంలో మండల్ కమిషన్ సిఫార్సులను వ్యతిరేకించింది. కులభేదాలకు అతీతంగా ఏకీకృత హిందూ విధానాన్ని సమర్థించింది. అటువంటిది బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు కులగణనకు అంగీకరించడాన్ని బీజేపీ ఎన్నికల ఎత్తుగడగానే భావించాలి. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలపై కుల సమీకరణలు తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి.జనగణన ఎప్పుడు మొదలు పెడతారో చెప్పకుండానే కులగణనపై ప్రకటన చేయడం ద్వారా బీహార్ ఎన్నికల్లో లబ్ధి పొందడమే బీజేపీ ముందున్న తక్షణ లక్ష్యం అనే సంగతీ అవగతమవుతున్నది. దేశంలో కుల గణన జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది సమాజంలోని వెనుకబడిన వర్గాలను అభివృద్ధి చేయడానికి మరింత సానుకూల చర్యలకు మార్గం సుగమం చేస్తుందని ఆయన నొక్కి మరీ చెప్పారు.ఈ నిర్ణయం తీసుకునేలా కేంద్రాన్ని ఒత్తిడి చేసింది తమ కుల గణన డిమాండేనని కాంగ్రెస్ చెబుతుండగా, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాలు కుల గణనను ఎప్పుడూ వ్యతిరేకించాయని, ఆ పార్టీ ఈ అంశాన్ని రాజకీయ సాధనంగా మాత్రమే ఉపయోగించిందని బీజేపీ పేర్కొంటుంది.ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేస్తూ.. "మోదీ జీ కుల గణన చేయవలసి ఉంటుందని మేము చెప్పాము. మేము దానిని చేయిస్తాము. ఇది మా దృష్టి ప్రభుత్వం పారదర్శకమైన కుల గణనను చేస్తుందని నమ్ముతున్నాము. దేశంలోని సంస్థలు, అధికార నిర్మాణంలో ఏ వర్గాలకు ఎంత భాగస్వామ్యం ఉందో అందరికీ తెలుసు" అని అన్నారు.దీని కోసం ఒత్తిడి చేస్తూనే ఉన్న వ్యక్తులు, సంస్థలను రాహుల్ గాంధీ అభినందించారు. వారి గురించి గర్వపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌ను ప్రతిఘటిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నేడు మీడియాతో మాట్లాడుతూ.. కొంతమంది తప్పుడు క్రెడిట్‌ను పొందుతున్నారని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ కుల ఆధారిత రిజర్వేషన్‌కు తీవ్ర వ్యతిరేకి అని దేశప్రజలు తెలుసుకోవాలన్నారు. ఆ తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం ఈ అంశాన్ని వెనక్కి నెట్టిందని ఆయన తెలిపారు.కుల గణన అంశం చాలా కాలంగా రాజకీయ చర్చనీయాంశంగా ఉంది. మొత్తానికి కుల గణన విషయంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య రాజకీయ పోరాటం తీవ్రంగా ఉంది. రాహుల్ గాంధీ దీనిని తమ విజయంగా చెప్పుకుంటున్నారు. కుల గణన ద్వారా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ వాదిస్తోంది. నెహ్రూ, ఇందిరా గాంధీల కాలంలో దీనిని వ్యతిరేకించినట్లు బీజేపీ చెబుతోంది. మండల్ కమిషన్ నివేదికను అమలు చేసినప్పుడు బీజేపీ మద్దతు ఇచ్చిందని ధర్మేంద్ర ప్రధాన్ గుర్తు చేశారు. బీజేపీ మాత్రం కాంగ్రెస్ దీనిని రాజకీయ సాధనంగా వాడుకుంటోందని ఆరోపిస్తోంది. ఈ అంశంపై ప్రజల స్పందన కూడా భిన్నంగా ఉంది. కొందరు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు బీజేపీ వాదనను సమర్థిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ అంశం ప్రధాన ప్రచారాస్త్రంగా మారే అవకాశం ఉంది.బీజేపీ మిత్రపక్షమైన నితీష్ ప్రభుత్వం బీహార్‌లో కులగణన చేసి, రాష్ట్ర జనాభాలో 63 శాతం మంది వెనుకబడిన తరగతుల వారే అని 2023లో ప్రకటించింది. వారి అభివృద్ధి కోసం ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ చర్యలైతే తీసుకోలేదు. పార్టీలు కులాలు, రిజర్వేషన్లను రాజకీయాలకు వాడుకోకుండా విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగు పరిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న విషయాన్ని గర్తించి ఆ దిశగా చర్యలు తీసుకుంటే బావుంటుంది.

## బిచ్చన్న చెరువులో అక్రమ మట్టి రవాణా



ఏలూరు ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గొల్లగూడెంలో బిచ్చన్న చెరువులో అర్ధరాత్రి అక్రమ మట్టితోలకాలు జోరుగా కొనసాగాయి. రెండు జెసిబిలు,20 ట్రాక్టర్లతో మట్టి రవాణా చేసి క్యాష్ చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవలేదని స్థానికుల ఆరోపణ. స్థానిక నేతల అండదండలతో అర్ధరాత్రులు మట్టి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. అర్ధరాత్రి మట్టితోలకాలపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు,సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నట్లు సమాచారం

# ఫైనాన్షియల్ స్ట్రైక్ తో పాక్ విలవిల

న్యూఢిల్లీ, మే 3, (న్యూస్ పల్స్) జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం సమీపంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22, 2025న జరిగిన ఉగ్రదాడి భారత్?పాకిస్థాన్ సంబంధాలను మరింత దిగజార్చింది. ఈ దాడిలో 26 మంది, ప్రధానంగా పర్యాటకులు, ప్రాణాలు కోల్పోయారు.

ఈ ఘటన వెనుక పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబాతో అనుబంధం ఉన్న 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)' ఉన్నట్లు భద్రతా వర్గాలు అనుమానిస్తున్నాయి.

ఈ దాడి సీమాంతర ఉగ్రవాదం యొక్క తీవ్రతను మరోసారి బయటపెట్టింది, దీంతో భారత ప్రభుత్వం దౌత్య, ఆర్థిక చర్యల ద్వారా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచేందుకు సన్నాహాలు చేస్తోంది.సీమాంతర ఉగ్రవాదానికి ఆర్థిక మూలాలను లక్ష్యంగా చేసుకుని భారత్ రెండు కీలక ఫైనాన్షియల్ స్ట్రైక్స్‌కు ప్రణాళికలు రూపొందిస్తోంది. మొదటిది ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ గ్రే లిస్ట్‌లో పాకిస్థాన్‌ను చేర్చేందుకు అంతర్జాతీయ ఒత్తిడి పెంచడం. రెండవది, అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి పాకిస్థాన్‌కు అందే 7 బిలియన్ డాలర్ల రుణ సహాయంపై ఆందోళనలు వ్యక్తం చేయడం. ఈ చర్యలు ఆర్థికంగా ఇప్పటికే సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్‌కు తీవ్ర దెబ్బ తీస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ అనేది 1989లో జీ?7 దేశాలు, ఐరోపా కమిషన్‌ల ఆధ్వర్యంలో పారిస్‌లో స్థాపించబడిన అంతర్జాతీయ సంస్థ. ఇది ఉగ్రవాద నిధులు, మనీ లాండరింగ్, ఇతర అక్రమ ఆర్థిక కార్యకలాపాలను నిరోధించేందుకు నిబంధనలు రూపొందిస్తుంది. ఊఅఖీఊ గ్రే లిస్ట్‌లో చేరిన దేశాలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణాలు, విదేశీ పెట్టుబడులు పొందడంలో తీవ్ర ఆటంకాలు ఎదుర్కొంటాయి. పాకిస్థాన్ 2018?2022 మధ్య గ్రే లిస్ట్‌లో ఉండి, 2022లో బయటపడినప్పటికీ, పహల్గాం దాడి నేపథ్యంలో మళ్లీ ఈ జాబితాలోకి చేరే అవకాశం ఉంది.పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే దిగజారుడు స్థితిలో ఉంది. అధిక ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, రాజకీయ అస్థిరతలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. 2024 జులైలో ఐఎంఎఫ్‌తో ఒప్పందం ద్వారా పాకిస్థాన్‌కు 7 బిలియన్ డాలర్ల రుణ సహాయం లభించినప్పటికీ, ఈ నిధులు ఉగ్రవాద కార్యకలాపాలకు దుర్వినియోగమవుతున్నాయని భారత్ ఆరోపిస్తోంది. ఊఅఖీఊ గ్రే లిస్ట్‌లో చేరితే, ఐఎంఎఫ్ రుణాలు, విదేశీ పెట్టుబడులు మరింత కష్టతరమవుతాయి, ఇది పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనపరుస్తుంది.పహల్గాం దాడి అనంతరం భారత్ తీసుకున్న కీలక నిర్ణయాల్లో సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేత ఒకటి. 1960లో రూపొందిన ఈ ఒప్పందం సింధూ నదీ జలాలను భారత్, పాకిస్థాన్ మధ్య పంచుకునే విధానాన్ని నిర్దేశిస్తుంది. ఈ ఒప్పందం నిలిపివేతతో పాకిస్థాన్‌లో వ్యవసాయం, జలవిద్యుత్ ఉత్పత్తి తీవ్రంగా దెబ్బతింటాయి. అదనంగా, భారత్ పాకిస్థాన్ పౌరుల వీసాలను రద్దు చేయడం, అటారీ?వాఘా సరిహద్దును మూసివేయడం, పాకిస్థాన్ దౌత్యవేత్తలను వెనక్కి పంపడం వంటి చర్యలు తీసుకుంది.పహల్గాం దాడిని అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఖండించింది. అమెరికా ఉపాధ్యక్షుడు జెడీ వాన్స్ ఈ దాడికి పాకిస్థాన్ బాధ్యత వహించాలని, ఉగ్రవాద నిర్మూలనలో భారత్‌కు సహకరించాలని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి భారత్, పాకిస్థాన్‌లను సంయమనం పాటించాలని కోరింది, అయితే భారత్ ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేసింది. చైనా మాత్రం పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచి, దాడిపై నిష్పక్షపాత విచారణ జరగాలని కోరింది.జాతీయ దర్యాప్తు సంస్థ పహల్గాం దాడి కేసును స్వీకరించి, సమగ్ర విచారణ చేపట్టింది. దాడిలో పాకిస్థాన్‌కు చెందిన ముగ్గురు, ఒక స్థానిక ఉగ్రవాది పాల్గొన్నట్లు గుర్తించారు. లష్కరే తోయిబాతో సంబంధం ఉన్న టీఆర్ఎఫ్ ఈ దాడికి బాధ్యత వహించినట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. స్థానికంగా 10 మందికి పైగా కశ్మీరీలు ఉగ్రవాదులకు సహకరించినట్లు దర్యాప్తులో తేలింది.

భద్రతా దళాలు ఉగ్రవాదుల ఇళ్లను ధ్వంసం చేయడం, విస్తృత గాలింపు చర్యలు చేపట్టడం వంటి కఠిన చర్యలు తీసుకుంటున్నాయి.పహల్గాం ఉగ్రదాడి భారత్?పాకిస్థాన్ సంబంధాలను మరింత దిగజార్చడమే కాక, సీమాంతర ఉగ్రవాదంపై భారత్ దృష్టిని మరింత పదును చేసింది.

ఆర్థిక, దౌత్య చర్యల ద్వారా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచడం, అంతర్జాతీయ మద్దతును సమీకరించడం ద్వారా భారత్ ఉగ్రవాద నిర్మూలనలో దృఢమైన వైఖరిని కొనసాగిస్తోంది. ఈ చర్యలు పాకిస్థాన్ ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై ఎలాంటి ప్రభావం చూపుతాయి, అంతర్జాతీయ సమాజం ఎలా స్పందిస్తుంది అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

# దాడిలో ఇద్దరు పాకిస్తానీయులు లోయలో జల్లెడ పడుతున్న ఎన్ ఐఏ

న్యూఢిల్లీ, మే 4, (న్యూస్ పల్స్) పహల్గామ్ ఉగ్రదాడిపై ఎన్ఐఏ దర్యాప్తు వేగం పుంజుకుంది. బైసరన్ వ్యాలీకి మూడు కిలోమీటర్ల పరిధిలో ఘటన రోజు ఉన్న వారందరి నుంచీ దర్యాప్తు సంస్థ వివరాలు రాబట్టింది. ఉగ్రదాడి జరిగిన చోట త్రీడీ మ్యాపింగ్‌తో పాటు సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసింది నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ. స్వయంగా డీజీ పహల్గామ్ చేరుకోవటంతో దర్యాప్తు సంస్థకు బలమైన ఆధారాలు దొరికినట్లే కనిపిస్తోంది. ఇన్వెస్టిగేషన్‌లో బయటపడ్డ అంశాలతో కేంద్ర హోం మంత్రిత్వశాఖకు సమగ్ర నివేదిక సమర్పించబోతోంది ఎన్ఐఏ. .. పహల్గామ్ సమీపంలోని బైసరన్‌లో జరిగిన ఉగ్ర దాడిని ఛేదించేందుకు అన్ని కోణాల్లో ఎంక్వైరీ చేస్తోంది ఎన్ ఐఏ. ఎటాక్ జరిగిన స్పాట్‌కి అత్యాధునిక పరికరాలతో వెళ్లారు అధికారులు. ఆల్ టెర్రయిన్ వెహికిల్స్, ఘటనాస్థలికి వెళ్లి దర్యాప్తును స్పీడప్ చేశారు. బైసరన్ లోయలో 3ఆ మ్యాపింగ్ చేశారు. ఇప్పటివరకు సేకరించిన ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం ఆధారంగా త్రీడీ మ్యాపింగ్‌తో పాటు, సీన్ రీకన్‌స్ట్రక్షన్ ప్రక్రియ చేపట్టారు. ఉగ్రవాదుల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లపై కచ్చితమైన వివరాలు సేకరిస్తున్నారు ఎన్ఐఏ అధికారులు. ఇప్పటి వరకు వందలాది మంది వాంగ్మూలాలను నమోదు చేసిన అధికారులు.. ఫొటోగ్రాఫర్లు, డ్రైవర్లు, జిప్ రైడర్స్‌తోపాటు పోనీ రైడర్స్‌ను ప్రశ్నించారు. కొందరు టూరిస్టులపైనా అనుమానాలు వ్యక్తం చేస్తూ.. వాళ్లనూ ఇంటరాగేట్ చేశారు.త్రీడీ మ్యాపింగ్‌తో ఉగ్రవాదులు ఎక్కడి నుంచి పహల్గామ్‌కు వచ్చారనేది తెలుసుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. మరోవైపు కశ్మీర్‌లో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరించాయి నిఘా వర్గాలు. ఉగ్రవాదుల ఇళ్లను భద్రతా బలగాలు పేల్చి వేస్తుండటంతో.. దానికి ప్రతీకారంగా దాడులకు దిగే అవకాశం ఉందని సూచించాయి. ఇక కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న 87 పర్యాటక కేంద్రాల్లో 48 కేంద్రాలను మూసివేశారు. ప్రధాన ప్రదేశాలు గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ సరస్సు ప్రాంతాల్లో భద్రతా దళాలు, లోకల్ పోలీసులు, ప్రత్యేక బృందాలు మోహరించాయి. పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిపై ఉగ్రవాద నిరోధక సంస్థ జాతీయ దర్యాప్తు సంస్థ ప్రాథమిక నివేదిక పాకిస్తాన్ నిఘా సంస్థ, ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ , ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా మధ్య సంబంధాన్ని సూచిస్తుందన ఎన్ ఐఏ వర్గాలు తెలిపాయి.ఎన్ ఐఏ వర్గాల సమాచారం ప్రకారం, 26 మందిని, ప్రధానంగా పర్యాటకులను చంపిన ఉగ్రవాద దాడి వెనుక కుట్ర, సీనియర్ ఎూఎ నిర్వాహకులు జారీ చేసిన ఆదేశాల మేరకు ఒమలోనే ప్రణాళిక రచించినట్లు ఎన్ ఐఏ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రణాళిక పాకిస్తాన్‌లోని లష్కరే ప్రధాన కార్యాలయంలో అధికారికంగా రూపొందించినట్లు అనుమానిస్తున్నారు. దాడికి కేంద్రంగా ఉన్న ఇద్దరు ఉగ్రవాదులు హాష్మీ ముసా (అలియాస్ సులేమాన్), అలీ భాయ్ (అలియాస్ తల్హా భాయ్) పాకిస్తాన్ జాతీయులుగా నిర్ధారించారు. అదుపులోకి తీసుకున్న కార్యకర్తల విచారణలో, దాడి చేసిన ఇద్దరు వ్యక్తులు పాకిస్తాన్‌కు చెందిన హ్యాండ్లర్లతో స్థిరమైన సంభాషణను కొనసాగించారని, సమయం, లాజిస్టిక్స్, అమలుపై నిర్దిష్ట సూచనలు అందుకున్నారని తేలింది. దాడికి వారాల ముందు ఉగ్రవాదులు భారత భూభాగంలోకి ప్రవేశించారని, వారికి ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ నెట్‌వర్క్ సహాయం చేసి, ఆశ్రయం, నావిగేషన్, నిఘా వంటి స్థానిక లాజిస్టికల్ మద్దతును అందించిందని ఎన్ ఐఏ వర్గాలు భావిస్తున్నాయి.ఎన్ ఐఏ విస్తృతమైన ఫోరెన్సిక్, ఎలక్ట్రానిక్ డేటా సేకరణను నిర్వహించింది. నేరస్థలం నుండి స్వాధీనం చేసుకున్న 40 కి పైగా కార్ట్రిడ్జ్‌లను బాలిస్టిక్, రసాయన విశ్లేషణ కోసం పంపారు. దాడి జరిగిన ప్రదేశం 3ఆ మ్యాపింగ్‌ను కూడా నిర్వహించారు మరియు లోయ చుట్టూ ఉన్న మొబైల్ టవర్ల నుండి డంప్ డేటాను సేకరించారు. దాడికి ముందు రోజుల్లో ఈ ప్రాంతంలో ఉపగ్రహ ఫోన్ కార్యకలాపాలు పెరిగాయి. బైసారన్, చుట్టుపక్కల కనీసం మూడు ఉపగ్రహ ఫోన్లు పనిచేస్తున్నాయి. రెండింటి నుండి వచ్చిన సంకేతాలను గుర్తించిన ఎన్ఐఏ అధికారులు విశ్లేషించారు.మొత్తం మీద, ఎన్ ఐఏ భద్రతా సంస్థలు 2,800 మందికి పైగా వ్యక్తులను ప్రశ్నించాయి. మే 2 నాటికి, 150 మందికి పైగా వ్యక్తులు తదుపరి విచారణ కోసం కస్టడీలో ఉన్నారు. వీరిలో అనుమానితులు, జమాతే-ఇ-ఇస్లామి వంటి నిషేధిత గ్రూపులు, హురియత్ కాన్ఫరెన్స్‌లోని వివిధ వర్గాలతో సంబంధాలు ఉన్న వ్యక్తులు ఇద్దరూ ఉన్నారు. కుప్వారా, పుల్వామా, సోపోర్, అనంతనాగ్, బారాముల్లా సహా పలు జిల్లాల్లో దాడులు జరిగాయి. సరిహద్దు ఉగ్రవాద మౌలిక సదుపాయాలకు సహాయం చేస్తున్నట్లు అనుమానిస్తున్న అనేక మంది వ్యక్తుల నివాసాలను సోదాలు చేశారు. 1999 ఎఅ-814 హైజాక్ కేసులో కీలక వ్యక్తి, ప్రస్తుతం పాకిస్తాన్ నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భావిస్తున్న ముష్తాక్ అహ్మద్ జర్గర్ అలియాస్ లాట్రమ్ నివాసంలో సోదాలు జరిగాయి. జర్గర్ శ్రీనగర్ నివాసాన్ని గతంలో 2023లో కఠినమైన చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద అటాచ్ చేశారు.దాడి చేసిన వారి కదలికలను తెలుసుకోవడానికి పహల్గామ్ చుట్టుపక్కల ఉన్న కీలక రవాణా, ప్రజా ప్రాంతాల నుండి సీసీటీవీ ఫుటేజ్‌లను ఎన్ ఐఏ స్వాధీనం చేసుకుంది. ప్యాటర్న్ మ్యాపింగ్ కోసం వారు పరిసర ప్రాంతాలలోని భద్రతా తనిఖీ కేంద్రాల నుండి డేటాను కూడా సమీక్షిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, పోనీ ఆపరేటర్లు, ఆహార విక్రేతలు సహా డజన్ల కొద్దీ ప్రత్యక్ష సాక్షులు దాడి రీగన్‌ట్రక్షన్ చేయడానికి సాక్ష్యాలను అందించారు. చాలా మంది దాడి చేసినవారు బాడీ-మౌంటెడ్ కెమెరాలను ఉపయోగిస్తున్నారని, బహుశా ప్రచార ప్రయోజనాల కోసం సంఘటనను రికార్డ్ చేయడానికి అని భావిస్తున్నారు. ఈ ఖాతాలు ఫోరెన్సిక్ పరిశీలనలో ఉన్నాయి.2024లో గండేర్బల్ జిల్లాలోని సోనామార్గ్‌లోని జి-మోర్హ్ సొరంగం సమీపంలో జరిగిన ఉగ్రవాద దాడికి, ఆరుగురు కార్మికులు, ఒక వైద్యుడు సహా ఏడుగురు వ్యక్తులు మరణించిన పహల్గామ్ హత్యలకు మధ్య సంబంధాలను ఎన్ ఐఏగుర్తించింది. ఈ దాడిలో ఎల్ఇటి మద్దతుగల అదే యూనిట్‌కు చెందిన ఆపరేటర్లు రెండు దాడులను నిర్వహించినట్లు భావిస్తున్నారు. 2024 డిసెంబర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గుర్తించిన ఒక కార్యకర్త జునైద్ అహ్మద్ భట్ హతమయ్యాడు. ఇప్పుడు హాషీం ముసాగా గుర్తించిన మరో అనుమానితుడు రెండు దాడుల్లో పాల్గొన్నట్లు సమాచారం.

# క్రీడాకారులకు టీ షర్టుల పంపిణీ.



కొడిమ్యాల, జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాల మండల కేంద్రంలోని అంబేద్కర్ యూత్ టీం క్రీడాకారులకు చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ టీ షర్టులను పంపించగా శనివారం రోజున బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్ మండల నాయకులతో కలిసి పంపిణీ చేశారు..

× అనంతరం పులి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా క్రీడలపై ఆసక్తి కనబరచాలని అన్నారు. చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ అనేక మంది క్రీడాకారులను విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు.×

పదవి ఉన్నా లేకున్నా అనాథ పిల్లలను ప్రతి దసరా పండగకి ఇంటికి పిలిపించి కొత్త బట్టలు పెట్టి వారితోనే కలిసి పండగ జరుపుకునే గొప్ప నేత రవిశంకర్ అని కొనియాడారు..

× ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు కొత్తూరి స్వామి,బి ఆర్ ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షులు గడ్డం లక్ష్మారెడ్డి,బి ఆర్ ఎస్ మండల ఉపాధ్యక్షులు పర్లపల్లి ప్రభుదాస్, సీనియర్ నాయకులు బింగి మనోజ్ కుమార్, బైరి వెంకటి, రాచకొండ చంద్రమోహన్,బి ఆర్ ఎస్ యువ నాయకులు పర్లపల్లి శ్రావణ్, అఖిల్, నాని, యువకులు తదితరులు పాల్గొన్నారు

## ఈ నెల 8,9 తేదీల్లో తుడా టవర్స్ వాణిజ్య గదుల వేలం క్రమపద్ధతిలో నిర్వహించండి.

### ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య



మే 8,9, తేదీల్లో ఈ-వేలం ద్వారా తుడా టవర్స్ వాణిజ్య గదుల విక్రయాన్ని క్రమపద్ధతిలో నిర్వహించాలని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలోని అన్నమయ్య కూడలి వద్ద నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్ ను శనివారం ఉదయం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తిరుపతిలోని అన్నమయ్య కూడలి వద్ద 3.60 ఎకరాల స్థలంలో ఉ+13 అంతస్తులతో ప్రతిష్టాత్మకంగా "తుడా టవర్స్" నిర్మిస్తున్నామని అన్నారు. ఇందులో నివాసయోగ్యమైన గదులకు ఈ-వేలం నిర్వహించి విక్రయించడం జరిగిందని తెలిపారు. తుడా టవర్స్ గ్రౌండ్ ఫ్లోర్ (10 గదులు), మొదటి అంతస్తు (21 గదులు)లోని వాణిజ్య గదులను మే 8, 9 తేదిలలో ఈ-వేలం ద్వారా విక్రయించనున్నామని అన్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. వాణిజ్యపు గదులు 2000 నుండి 9000 చదరపు అడుగుల విస్తీర్ణముతో నగర వాణిజ్య సముదాయములకు అత్యంత అనువైనదిగా నిర్మించమని అన్నారు. వివరముల కొరకు తుడా కార్యాలయము, తుడా టవర్స్ వెబ్సైట్లు లిలిలి.బిబీటజీబిసీలివతీబ.తిని/లిలిలి.బిబీటజీజీజూ.తిని సంప్రదించాలని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ.రవీంద్ర, డి.ఈ. భాషా, తదితరులు ఉన్నారు.

## ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలి.

### కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక అధికారులను ఆదేశించారు.

శనివారం క్యాంప్ కార్యాలయం నుండి స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ, మండల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల విచారణ ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ

ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన కుటుంబాలకు న్యాయం జరగేలా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా మరియు సమగ్రంగా నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమం ద్వారా నిజంగా అవసరమైన ఇండ్లు లేని పేద కుటుంబాలకు ఇండ్లు ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.

గ్రామ, వార్డు స్థాయిలో అర్హులైన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి, వారిని ఎంపిక చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకూడదని, సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేయడం జరుగుతుందని, ఏదేని అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించాలని అన్నారు.

విడతల వారిగా నిధులు మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్సులో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ విచారణ ప్రత్యేక అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

## ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

### కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి ఎండలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎండలు, వడగాలులతో జరిగే ప్రమాదాలు పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని

శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయని, అకాల వర్షాలు వల్ల భూమి నుండి వేడి వస్తుందని, ఎండ తీవ్రత కూడా అధికంగా ఉంటున్నందున ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య సంరక్షణ చర్యలు పాటించాలని సూచించారు. ఎండబారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, ఎండ అధికంగా ఉన్న సమయాల్లో బయటకు వెళ్లకుండా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల మధ్య ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని ప్రజలు ఇళ్లు నుంచి బయటకు రావొద్దని సూచించారు.

ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వడ దెబ్బలు, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు. వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. చిన్నారులు, వయోవృద్ధులతో ప్రయాణం శ్రేయస్కరం కాదని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇంటి నుండి బయటికి వస్తే తలకు ఎండ తగలకుండా గొడుగు, కండువా,టోపితో కవరు చేయాలని సూచించారు. మంచినీళ్లు అధికంగా తీసుకోవాలని తీసుకోవాలని, వదులుగా ఉన్న కాటన్ దుస్తువులను ధరించాలని తెలిపారు.

ఎండ అధికంగా ఉన్న సమయాల్లో దూర ప్రయాణాలు చేయకూడదని తెలిపారు. వడదెబ్బకు గురికాకుండా తరచుగా ఓ.ఆర్.ఎస్ ద్రావణం, మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి ఉపశమనం ఉంటుందని అన్నారు. ఎండలు వల్ల చర్మంపై ఎర్రటి దద్దుర్లు, పొడిబారడం లాంటి మార్పులను ప్రజలు గమనించాలని తెలిపారు. వేడి వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయక తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రులల్లో వైద్య సేవలు పొందాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు 108 కు ఫోన్ చేయాలని అన్నారు. నిల్వ ఉన్న ఆహారం, వేపుళ్లు, ఆరు బయట ఆహార పదార్థాలుకు దూరంగా ఉండటం మంచిదని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులు కూలీలు ఉదయం 6 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 6 గంటలు వరకు పనులు చేపించాలని, పనులు జరుతున్న ప్రదేశాల్లో రక్షణ, జాగ్రత్తలు పాటించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## సర్కారు నిర్లక్ష్యంతోనే రైతులకు తీరని నష్టం...

- విపత్తుపై పాలకులకు ముందుచూపు లేదు
- మాయిశ్చర్ పేరుతో కాంటాలు ఆలస్యం చేసిండ్లు
- ఎకరాలకు రూ.50వేలు నష్టపరిహారం అందించాలే
- ఈ ప్రాంత రైతులపై మంత్రికి చిత్తశుద్ధి లేదు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్






జయశంకర్ భూపాలపల్లిప్రజాపాలన పేరుతో పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యం మూలంగానే రైతులకు తీరని నష్టం వాటిల్లిందని, అకాల వర్షానికి పంట నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షంతో తడిసిన ధాన్యంను ఆయన పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక కష్టాలను ఎదుర్కొంటూ పుట్టెడు పెట్టుబడులతో సాగు చేసిన పంటలు చేతికందే సమయంలో చేజారి పోతే ఎంత బాధ ఉంటుందో పాలకులు అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి ఏటా ఈ సీజన్‌లో అకాల వర్షాలు వస్తాయని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పదిహేను ఇరువై రోజుల క్రితం కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తే మాయిశ్చర్ రాలేదంటూ కాంటాలు పెట్టకపోవడం మూలంగానే ఇంత పెద్ద మొత్తంలో నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. ఇంత పెద్ద ఎత్తున రైతులకు నష్టం జరిగితే అడిషనల్ కలెక్టర్ వచ్చి చూసివెళ్లాడే కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కనీసం స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాపుదనపోళ్ల మీటింగ్‌లకు పోయి కాపుదనం కుటుంబంలో పుట్టకపోయినా మీ గురించి ఆలోచన చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఈనాడు రైతులకు కన్నీటి పర్వంతమవుతుంటే పట్టించుకోడా అని ప్రశ్నించారు. ఆనాడు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారని, కానీ ఇప్పుడు ధాన్యం తడిసిందని రైస్ మిల్లుల వద్ద దింపుకోవడం లేదని, బస్తాలు దింపుకోకపోతే రైతులతో కలిస రైస్ మిల్లును ముట్టడిస్తామన్నారు. నియోజకవర్గంలోని గరీబోళ్లే ఓట్లు వేస్తే 40ఏండ్లుగా అధికారంలో ఉంటూ కనీసం ప్రజల గురించి ఆలోచన చేయడం లేదని, ఓట్లు వస్తే నోట్ల సంచులతో వచ్చి గెలువచ్చనే ఆలోచన మానుకోవాలన్నారు. హైదరాబాద్‌లో నాలుగు ఆఫీస్‌లు ప్రారంభించి దోపిడి చేస్తున్నారని, దోపిడి చేసిన దాంట్లో కొంతైనా పేద ప్రజలకు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా శ్రీపాద ట్రస్ట్ పేరున పంట నష్టపోయిన రైతులకు పదివేల చొప్పున అందించాలని ఆయన డిమాండ్ చేశారు. తండ్రి ఆశయాలంటూ పదపదే మాట్లాడే ఎమ్మెల్యే తన తండ్రి ఆశయాలేంటో చెప్పాలని, ఆ ఆశయాలు పేద ప్రజల గురించే అయితే అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల చొప్పున ఇప్పించి ఆదుకోవాలన్నారు. మండలంలో ఇంత పెద్ద విపత్తుకు ప్రభుత్వంతోపాటు అధికారులు, పాలకులే కారణమని, స్థానిక పీఏసీఎస్ చైర్మన్ ఒక రైతు బిడ్డగా ఎందుకు ఆలోచన చేయడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా కనీసం రైతులకు సౌకర్యాలు కల్పించకపోవడం ఏంటని ప్రశ్నించారు. కేంద్రాల నిర్వహణ ద్వారా వచ్చే కమీషన్‌లు మీ కోసం కాదని, రైతులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు వినియోగించాలని ఆయన హితవు పలికారు.ప్రజా ప్రభుత్వమని, వందేళ్ల చరిత్ర ఉందని గొప్పలు చెప్పుకోవడం కాదని, ఇలాంటి విపత్తు జరిగితే రైతులకు అండగా నిలిచి భరోసా ఇవ్వాలని ఆయన అన్నారు. నిత్యం ముఖ్యమంత్రి పక్కనే కూర్చుంటూ అనేక సలహాలు ఇచ్చే మంత్రి ఇక్కడి ప్రజల గురించి ఆలోచన చేయకపోవడం బాధాకరమని, ప్రజలకు ఉపయోగపడని పదవులు ఎందుకని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజలు కష్టాల్లో ఉంటే వారికి అండగా నిలుస్తామని, ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే స్పందించి అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు సరైన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## బేడ బుడగ జంగల కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ బేడ బుడగ జంగల కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. సంక్షేమ పథకాల అమలులో మొదటి ప్రాధాన్యత కల్పించాలి అని బేడ బుడగ జంగా హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గగనం మత్తప్ప, వ్యవస్థాపక ఫౌండర్ చైర్పర్సన్ గగనం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ ఎన్నిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వ్యవస్థాపక అధ్యక్షులు గగనం మత్తప్ప, ఫౌండర్ చైర్పర్సన్ గగనం శ్రీనివాసులు లు హాజరై మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా బేడ బుడగ జంగం కులస్తులు పది లక్షలకు పైగా ఉన్నారని 2011 జనాభా లెక్కల ప్రకారం కేవలం ఒక లక్ష జనాభా మాత్రమే ఉన్నారని లెక్కించారన్నారు. ఈ లెక్కల అనుసారంగా ఎస్సీ వర్గీకరణ బి గ్రూప్ లో నష్టపోయిన జనాభా లో మా కులస్తులు పూర్తిస్థాయిలో నష్టపోయారన్నారు. బేడ బుడగ జంగం కులస్తులకు పదివేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చదువులో పూర్తిస్థాయిలో వెనుకబడిన బేడ బుడగ జంగాలకు నాణ్యమైన చదువు కోసం కార్పోరేట్ పాఠశాలల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. విద్య ఉపాధి రాజకీయ రంగాలలో గవర్నర్ కోటా కింద నామినేటెడ్ పోస్టులలో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. సంక్షేమ పథకాలలో అమలులో మొదటి ప్రాధాన్యత మాకే ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లలో 10% మా బేడ బుడగ జంగంలకు కేటాయించాలన్నారు.

## ఉప్పల్ లో బీజేపీ ర్యాలీ

మేడ్చల్ ఉప్పల్ కారిడార్ పనులు వేగవంతం చేయడానికి ప్రభుత్వం పై, జిహెచ్ఎంసి పై వత్తిడి పెంచడానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉప్పల్ లో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ఉప్పల్ ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్న సందర్భంగా కేంద్రాన్ని ఒప్పించి 600 కోట్ల నిధులతో ఫ్లైఓవర్ను సాంక్షన్ చేయించడం జరిగింది. కానీ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం రోడ్డు వెడల్పు చేయించడంలో,బాధితులకు నష్ట పరిహారం చెల్లించే విషయంలో విఫలమైంది అని మండిపడ్డారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహాలో అలసత్వాన్ని ప్రదర్శిస్తూ కారిడార్ పనుల విషయంలో జాప్యం కొనసాగిస్తుంది. గతంలో ఈ అలసత్వానికి కేంద్ర ప్రభుత్వం 20 కోట్ల నష్టపరిహారాన్ని కూడా విధించిందని గుర్తు చేశారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం, జిహెచ్ఎంసి అధికారులు పనులను వేగవంతం చేసి కారిడార్ పనులు పూర్తి చేయాలని అన్నారు. లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో అనేక తరహాలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## కుక్కల దాడిలో బాలుడు మృతి

నంద్యాల జిల్లా బేతంచర్ల పట్టణంలో ఘోరం జరిగింది. కుక్కల దాడిలో నాలుగేళ్ల చిన్నారి మృతి చెందాడు. హనుమాన్ నగర్ కాలనీలో ఉంటున్న హుస్సేన్ బాషా, ఆశ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె సంతానం. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న చిన్న కుమారుడు మోహిద్దీన్ (4) పై వీధి కుక్కలు దాడి చేయడంతో మృతి చెందాడు. పసిబాలుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదించారు

## నటుడు విజయ్ దేవరకొండ పై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి

### - తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్

సినీ నటుడు విజయ్ దేవరకొండ కొన్ని రోజుల క్రితం సినీ నటుడు సూర్య నటిస్తున్న రెట్రో సినిమా ఫ్రీ రిలీజ్ ఈవెంట్ లో గిరిజనుల గురించి అవమానకరంగా మాట్లాడడం జరిగింది.దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని త్యాగాల చరిత్ర ఉన్న గిరిజన జాతి గురించి ఇలాంటి అవగాహన లేకుండా మాట్లాడిన విజయ్ దేవరకొండపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని తెలంగాణ జరిగిన శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ డిమాండ్ చేశారు. అదేవిధంగా గిరిజన జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో ఆయన ఇళ్ళు, ఆఫీస్ ముట్టడిస్తామని తెలిపారు.

## జీహెచ్ ఎంసి సిబ్బంది ధర్నా

హైదరాబాద్ సర్కిల్ 14 టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరేష్ పై బిజెపి కార్పొరేటర్ రాకేష్ జష్వాల్ జరిపిన దాడి వివాదస్పదమయింది. సర్కిల్ 14 టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరేష్ పై దాడికి నిరసనగా ఆబిడ్స్ లోని జిహెచ్ఎంసి కార్యాలయం ముందు జిహెచ్ఎంసి అధికారులు ధర్నాకు దిగారు. విధులు బహిష్కరించి జిహెచ్ఎంసి కార్యాలయం నిరసన చేపట్టారు. వెంటనే రాకేష్ జష్వాల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. బిజెపి జాంబగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు...

## ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణి మృతి..బంధువుల అందోళన

తాండూర్ జిల్లా మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 8 నెలల గర్భిణీ మృతి చెందింది. పెద్దేముల్ మండలం పషాపూర్ తండా సుమిత్రా బాయి జైసింగ్ కు ఆలస్యంగా చికిత్స అందించడం కారణంగానే మృతి చెందిందని బంధువుల ఆరోపణ. నొప్పులతో ఉదయం 5 గంటలకు వచ్చినా వైద్యులు పట్టించుకోలేదని అన్నారు. స్టాఫ్ నర్స్ 9 గంటలకు చికిత్స అందించిందని ఆరోపించారు. గర్భిణీ సుమిత్రా బాయి అపస్మారక స్థితిలో వెళ్లపోయింది. తరువాత మృతి చెందింది. ఆలస్యంగా చికిత్స అందించినందుకే మృతి చెందిందని బంధువులు ఆందోళనకు దిగారు. జిల్లా మాతా శిశు ఆసుపత్రిలో ఎమర్జెన్సీగా వచ్చిన అన్ని కేసులు ఇలా అవడం పై పలువురు విమర్శలు వెల్లువెత్తాయి.

## పారిశుద్ధ కార్మికులకు ఎమ్మెల్యే బట్టలు పంపిణీ

పెద్దపల్లి ప్రతినిధి: పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో శనివారం పారిశుధ్య కార్మికులకు బట్టలు, ఈ.ఎస్.ఐ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ మే డే రోజు నిర్వహించాల్సిన ఈ కార్యక్రమం, అనివార్య కారణాలవల్ల ఈ రోజు అందించి నట్లు తెలిపారు.మేడే అంటే కార్మికులు హక్కుల కోసం పోరాడి సాధించుకున్న రోజని అన్నారు. పారిశుధ్య కార్మికులు కష్టపడి పని చేస్తున్నారని, వారి పని విధానాన్ని మెరుగుపరుచు కొని, విధులు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్లాస్టిక్ కవర్లను, చెత్తను కొందరు పట్టణ ప్రజలు డ్రైనేజీలో, వ్యాపారులు రోడ్లపై వేస్తున్నారని దీనివల్ల పారిశుధ్య కార్మికులకు ఇబ్బంది అవుతుందని, వారు చేసే పని మనం కూడా చేస్తే వారి కష్టం విలువ తెలుస్తుందని పేర్కొన్నారు. మన పరిసర ప్రాంతాలను మనమే పరిశుభ్ర పరుచుకుంటూ చెత్తను డబ్బాలలో వేసి, మీ వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందజేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. పెద్దపల్లి పట్టణంలో 25 కోట్ల 60 లక్షల రూపాయల అమృత్- 2 నిధులతో రెండు వాటర్ ట్యాంకులతో పాటు, పైప్ లైన్ల నిర్మాణం ద్వారా చివరి ప్రాంత ప్రజలకు ఈ నల్లా కనెక్షన్లు ఇచ్చే పనులు జరుగుతున్నాయని తెలిపారు. పట్టణంలో వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా వాటర్ మేనేజ్మెంట్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు

# ఏసీబీ కస్టడీకి ఈఎన్సీ హరిరాం

## 36 ఏండ్ల సర్వీస్లో జీతభత్యాలు

## రూ.6.75 కోట్లు ఖర్చులు రూ.3.05 కోట్లు:

హైదరాబాద్ కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ భూక్యా హరిరాం ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ దర్యాప్తు ముమ్మరం చేసింది. కోర్టు అనుమతితో 5 రోజుల పాటు ఆయనను విచారించనున్నది.

శుక్రవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి హరిరాంను ఏసీబీ తమ కస్టడీలోకి తీసుకున్నది. సిటీ రేంజ్- 1 డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో హరిరాంను ప్రశ్నిస్తున్నారు. సోదాల్లో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, బ్యాంక్ అకౌంట్లు, బినామీ పేర్లతో ఉన్న ఆస్తుల వివరాలను రాబట్టనున్నారు.

ఏఈ నుంచి ఈఎన్సీ దాకా కీలక పదవులే

మొదటి రోజు కస్టడీ విచారణలో భూక్యా హరిరాంకు చెందిన వ్యక్తిగత , కుటుంబ, ఆర్థిక వివరాలు సేకరించారు. ఉద్యోగంలో చేరడానికి ముందు, చేరిన తర్వాత ఆయన సంపాదన గురించి ఆరా తీశారు. ఇప్పటికే ఏసీబీ సేకరించిన ప్రాథమిక వివరాల ప్రకారం.. ఏపీపీఎస్సీ రిక్రూట్‌మెంట్ ద్వారా1989 అక్టోబర్ 11న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఈఈ, గా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో హరిరాం చేరారు. ప్రమోషన్ల వారీగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ క్రమంలో నాటి సర్కారు ఆశీస్సులతో అతి తక్కువ సమయంలోనే ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా ప్రమోషన్ పొందినట్టు అధికారులు గుర్తించారని సమాచారం. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్‌కు ముందు గజ్వేల్ ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ సీఏడీ, ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా హరిరాం పనిచేస్తున్నారు.

ఇరిగేషన్ శాఖలో అత్యున్నత పదవులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో హరిరాం కీలకంగా వ్యవహరించారు. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్, ఎండీగా విధులు నిర్వర్తించారు. 2016 ఆగస్టు 5 నుంచి 2017 ఫిబ్రవరి 28 వ తేదీ వరకు డైరెక్టర్‌గా కొనసాగారు. ఆ తర్వాత తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నామినీ డెరెక్టర్‌గా 2017 జూన్ 29 వరకు, మంజీరా లిఫ్ట్ ఇరిగేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా 2022 జనవరి 20వ తేదీ వరకు పనిచేశారు.

గజ్వేల్ ఇరిగేషన్ అండ్ సీఏడీ ఈఎన్సీగా విధులు నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ సహా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో కీలక పదవులు నిర్వహించిన సమయంలో భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు గత నెల 26న టోలిచౌకీలోని హరిరాం నివాసంతో పాటు సిద్దిపేట, ఖమ్మం జిల్లాలు సహా మొత్తం 13 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

అధికారికంగా కొంతే అక్రమాస్తులు ఎన్నో

హరిరాం ఉద్యోగంలో చేరిన నుంచి 36 ఏండ్ల సర్వీస్‌లో జీతభత్యాలుసహా అధికారికంగా రూ.6.75 కోట్లు సంపాదించగా.. భార్య, ఇద్దరు పిల్లల అవసరాల కోసం రూ.3,05,69,638 ఖర్చు చేసినట్లు ఏసీబీ అధికారులు అంచనా వేశారు. ఆయన సంపాదనలో ఖర్చులు పోను రూ.3 కోట్ల 69 లక్షల 29 వేల 789 మాత్రమే సేవింగ్స్ ఉండాలని లెక్కలు తేల్చారు.

కానీ, రూ.5 కోట్ల 26 లక్షల 13 వేల 294 అదనంగా ఉన్నట్లు గుర్తించారు. ఇది ఆదాయానికి మించి అక్రమ సంపాదనగా అనుమానిస్తున్నారు. ఈ మేరకు సోదాల్లో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల ప్రకారం ఆస్తుల విలువ మొత్తం రూ.8 కోట్ల 95 లక్షల 43 వేల 789. వీటి విలువ బహిరంగ మార్కెట్లో రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్ల దాకా ఉంటుందని భావిస్తున్నారు కాగా, 5 రోజుల కస్టడీలో ఈ ఆస్తుల చిట్టాను బయటపెట్టే అవకాశం కనిపిస్తున్నది.

# సిబ్బంది విధులను క్రమశిక్షణతో నిర్వహించాలి

**ఎస్పీ అఖిల్ మహాజన్**

**అదిలాబాద్ సిబ్బంది ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి**

**విధులలో చెడు వ్యసనాల ను కలిగి ఉండరాదు.**

**అనవసరంగా తెలియని వ్యక్తులకు పూచికత్తు షూరిటీ ఇవ్వకుండా ఉండటం మంచిది.**

**వయసు పైబడిన సిబ్బందికి ప్రత్యేకంగా యోగ సాధన**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.**



సిబ్బంది విధులను నిర్వర్తించే క్రమంలో క్రమశిక్షణతో ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ప్రతి శనివారం రోజున స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు సిబ్బంది ప్రతి ఒక్కరికి పరేడ్ నిర్వహించ బడుతుందని, పరేడ్ వల్ల సిబ్బంది ఒకరి మధ్య ఒకరికి మధ్య సత్సంబంధాలు మెరుగు పడతాయని, అదేవిధంగా సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ వ్యాయామం చేస్తూ ఉండాలని తెలిపారు. పరేడ్లో మొదటగా రిజర్వ్ ఇన్స్పెక్టర్ టి మురళి జిల్లా ఎస్పీకి గౌరవ వందనాన్ని సమర్పించి ఏడు ప్లాటూన్ లతో కూడిన పరేడ్లో విడతల వారీగా ప్రత్యేక గౌరవ వందన సమర్పించారు. తదుపరి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. పరేడ్ వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచిస్తూ, సిబ్బంది విధులలో చెడు వ్యసనాలను సేవించకుండా ఉండాలని సూచించారు. పోలీసు వ్యవస్థకు క్రమశిక్షణ తప్పనిసరి క్రమశిక్షణ ఉల్లంఘన జరిగితే శాఖపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. సిబ్బంది చేసిన పరేడ్ మరింత ఉత్సాహంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఇతరుల ఇతర వ్యక్తులకు తెలియని వ్యక్తులకు పూచికత్తులు షూరిటీ, ఇవ్వకుండా ఉండాలని తెలిపారు. 50 ఏళ్లు పైబడిన సిబ్బందికి ప్రత్యేకంగా పరేడ్కు బదులు యోగ శిక్షణను అందించడం జరిగింది. పరేడ్లో భాగంగా సిబ్బంది అందరికీ ఆయుధాలపై మరియు వాటి వినియోగంపై, ట్రాఫిక్ సిబ్బందికి సిగ్నల్స్ పై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, సిహెచ్ కరుణాకర్, కే ఫణి ధర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు టి మురళి, బి శ్రీపాల్, ఎన్ చంద్రశేఖర్, ఎస్ఐ మావల వి విష్ణువర్ధన్, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూరెల్ల గ్రామంలో కనువిప్పు కార్యక్రమం

## పోలీసు కళాబృందం ప్రజలను చైతన్య పరిచే కనువిప్పు

## అనే కార్యక్రమం కూరెల్ల గ్రామంలో నిర్వహించడం జరిగింది.

## కోహెడ ఎస్ఐ అభిలాష్ మాట్లాడుతూ




యువత సన్మార్గంలో నడవాలి. గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దు, సరదా ఎంజాయ్ అనుకుంటే జీవితం దుర్భరమవుతుంది, తల్లిదండ్రులు కూడా పిల్లలు ఏం చేస్తున్నారు వారి ప్రవర్తనలో ఏమైనా మార్పులు ఉన్నాయా అని గమనిస్తూ ఉండాలని అన్నారు. ఏదైనా ఇబ్బంది కరమైన మార్పులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి మోహన్ మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

ఆశ, భయము, మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయి, బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు, అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ డీటెయిల్స్ గుర్తు తెలియని వ్యక్తులకు షేర్ చేయవద్దు, ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్సై అభిలాష్ తెలిపారు.మంత్రాలు తంత్రాలు అంటూ మూఢ నమ్మకాలు నమ్మవద్దని, మూఢ నమ్మకాలు నమ్మి ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు.గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి గ్రామ ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు సీసీ కెమెరాలు 24 గంటలపాటు ప్రజలకు సెన్సాఫ్ సెక్యూరిటీని ఇస్తాయని తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు,ఆన్లైన్ గేమ్స్ ఆడి మీరు మీ కుటుంబాలను రోడ్డున పడి వేయవద్దు.మూఢనమ్మకాలు, చేత బడులు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుక్మతల గురించి సిద్దిపేట పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శంకర్ బాబు, సౌమ్య, భాస్కర్, అరుణ నాటకం పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ప్రజలు ప్రజాప్రతినిధులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల ఆహారం నిల్వచేసుకోండి:

# పీఓకేలో ప్రజలకు అలర్ట్..!



హైదరాబాద్ పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త వాతావరణ నెలకొంది కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపు మాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు సూచనలు వినిపిస్తున్నాయి.ఇలాంటి తరుణంలో ఆహారం నిల్వ చేసుకోవాలంటూ స్థానికులను పీఓకే యంత్రాంగం అప్రమత్తం చేసింది.రెండు నెలలకు సరిపడా ఆహారాన్ని నిల్వ చేసుకోవాలని వాస్తవాధీన రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాల ప్రజలకు సూచనలు చేశాం, అని చౌధ్రీ అన్వర్ ఉల్‌హక్ స్థానిక అసెంబ్లీలో వెల్లడించారు. అలాగే స్థానిక ప్రభుత్వం రూ.100 కోట్లతో ఎమర్జెన్సీ ఫండ్‌ను ఏర్పాటు చేసింది. ఆహారం, ఔషధాలు, ఇతర కనీస అవసరాల సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకునేందుకు ఈ మొత్తాన్ని కేటాయించినట్లు ఉల్‌హక్ తెలిపారు.

పహల్గాం ఘటన పాక్ పై భారత్ ఫైనాన్షియల్ స్ట్రైక్స్,స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలోనే దొంగ దెబ్బతో పీఓకేను తన నియంత్రణలోకి తీసుకున్న పాకిస్థాన్- ఆ ప్రాంత అభివృద్ధిని గాలి కొదిలేసింది. ఇండియాపై విద్రోహచర్యలకు పాల్పడేందుకు ఉపయోగపడే ప్రదేశంగానే పీఓకేను పాక్ చూస్తోంది. పీఓకే ప్రధానమంత్రి పీఠం అధిరోహించినవారు ఇస్లామాబాద్ సర్కారు చేతుల్లో కీలు బొమ్మగానే మిగిలిపోతున్నారు. ఫలితంగా స్థానికుల హక్కులకు రక్షణ కరవవుతోంది. దివాళ అంచున ఉన్న పాకిస్థాన్‌ను స్థానిక తిరుగుబాట్లు, వరుస ఉగ్రదాడులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ భారత్ అనుకూలవాదం వినిపిస్తోంది.

కాగా, భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ ఇటీవల మాట్లాడుతూ.. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేశారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని విశ్వాసం వ్యక్తంచేశారు

# ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

## విద్యార్థులను సత్కరించిన సదాశివపేట మండల విద్యాధికారి




సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 3(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లాసదాశివపేట మండలలోనీ ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మండల విద్యాధికారి శనివారం నాడు మండల వనరుల కేంద్రంలో ఘనంగా సన్మానించారు,జి.ప.ఉ.పా కోనాపూర్ పాఠశాల విద్యార్థి సి. దుర్గాప్రసాద్ 551 మార్కులతో మొదటి స్థానంలో నిలువగా. జి.ప.ఉ.పా ఆత్మకూరు విద్యార్థిని జి. చందన మరియు. జి.ప.ఉ.పా ఆరూరు విద్యార్థిని టి. వాసిన్ ఫాతిమా 545 మార్కులతో రెండో స్థానంలో నిలిచారు,జీ.యన్.హెచ్.యస్ విద్యార్థిని గీతా లత 543 మార్కులతో మూడో స్థానంలో నిలిచారు,ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి యన్.శంకర్ మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించాయి.. చాలామంది విద్యార్థులు మెరువైన ప్రతిభ కనబరిచారని తెలియజేశారు,విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలియజేశారు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల యొక్క తల్లిదండ్రులను అభినందించారు,ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సుధాకర్, జీ.యన్.హెచ్.యస్ ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ ,జి.ప.ఉ.పా ఆరూర్ ప్రధానోపాధ్యాయురాలు పార్వతి మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు. విద్యార్థులు పాల్గొన్నారు,సదాశివపేట మండలంలో ఉత్తమ ఫలితాలు సాధించిన అన్ని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులకు మండల పక్షాన మండల విద్యాధికారి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

# సైకాలజీ ఉచిత స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

బద్వేలుమాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో రూపొందించిన సైకాలజీ స్టడీ మెటీరియల్ ను శనివారం ఉదయం యుటిఎఫ్ భవన్లో ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ త్వరలో జరగబోవు డీఎస్సీ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని తక్కువ సమయంలో సైకాలజీ సబ్జెక్టును పూర్తిగా అవగాహన చేసుకునే విధంగా డీఎస్సీ అభ్యర్థులకు కొరకు మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు గారు రూపొందించడం జరిగిందని తెలిపారు. కృష్ణ గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా 14 సంవత్సరాల పాటు పని చేయడంతో పాటు ఎంతోమంది ఉద్యోగాస్తులకు శిక్షణ ఇచ్చి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన వ్యక్తి కె ఎస్ లక్ష్మణరావు అని తెలిపారు. ఈయన నిరంతరం పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు కెరీర్ గైడెన్స్ అందిస్తుంటారని తెలిపారు. లక్ష్మణరావు గారి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన అనేకమంది ఉద్యోగాలను పొందడంతో పాటు సామాజిక సేవలో భాగస్వాములయ్యారని తెలిపారు.

ప్రస్తుతం డీఎస్సీ కి తక్కువ సమయం ఉన్నందువన సైకాలజీలో ఎక్కువ మార్కులు పొందడానికి ముఖ్యమైన అంశాలను పొందుపరుస్తూ చాలా సులభంగా అర్థమయ్యే విధంగా మెటీరియల్ తయారు చేయడం జరిగిందని తెలిపారు. ఈ మెటీరియల్ డీఎస్సీ అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కావలసినవారు యూటీఎఫ్ కడప జిల్లా శాఖను సంప్రదించి పొందగలరని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఏజాస్ అహ్మద్ ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, కేదార్నాథ్, నాగిరెడ్డి, ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కుల గణనను స్వాగతిస్తున్నాం

## -బీఎస్పీ సెంట్రల్ స్టేట్ కో - ఆర్డినేటర్ నిసాని రామచంద్రం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ మే 2** :కేంద్రంలో జనగణనతో పాటు కులగణను చేపడతామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బహుజన సమాజ్ పార్టీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ నిశాని రామచంద్రం తెలిపారు. మందమర్రి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందుగా పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఆత్మ శాంతి చేకూరాలని దాడికి కారణమైన ఉగ్రవాదులను అణచివేసేందుకు పాకిస్తాన్ దేశానికి బుద్ధి చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకున్న బహుజన్ సమాజ్ పార్టీ సాగతిస్తుందన్నారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్ల కాలంలో ఏనాడు కులగణన చేయలేదని ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కుల గణన చేసిందని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం తప్పుల తడకతో బీసీలకు అన్యాయం చేసే విధంగా వారి జనాభా సంఖ్యను తగ్గించి చూపించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో బీసీలకు ఎప్పుడైనా అన్యాయమే జరిగిందని ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో మంచిర్యాల జిల్లాలోని ఎమ్మెల్యేలు కూడా నడుస్తున్నారని అభివృద్ధి అనేది మచ్చుకైనా కానరావడం లేదని అన్నారు. బీసీల అభివృద్ధి మంచిర్యాల జిల్లా అభివృద్ధి కోసం పోరాటం చేసేందుకు బహుజన్ సమాజ్ పార్టీని మరింత పార్టీష్టపరుస్తామని నియోజకవర్గ మండల గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జోనల్ కో ఆర్డినేటర్ కాదాసి రవీందర్, జగన్ మోహన్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు గాజుల శంకర్, తాండూరు మండల అధ్యక్షుడు దుర్గం రాజశేఖర్, కుమ్మరి కృష్ణ చైతన్య, సతారపు నారాయణ, ఎం.జి జోసెఫ్, బ్యాగరి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి,ప్రభుత్వ,పాఠశాల,ప్రభుత్వ కాలేజ్ పనులు పరిశీలన

## ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మే 03** : మంచిర్యాల నియోజకవర్గం లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలో నూతన నిర్మించిన ప్రభుత్వ హాస్పిటల్ భవనాన్ని మరియు నూతన నిర్మిస్తున్న ప్రభుత్వ పాఠశాల,కళాశాల భవనాల పనులను పరిశీలించిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నేను చదువుకున్న స్కూల్, కళాశాల భవనాన్ని కట్టించడం నా అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు


## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మే 03 :** ప్రజలకు మరింత అందుబాటులో ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా వేగవంతమైన,మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో నిర్మాణం కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి,ప్రభుత్వ ఉన్నత పాఠశాల,కళాశాల భవనాల నిర్మాణ పనులను మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్సాగర్రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. మండల కేంద్రంలో చేపట్టిన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేసి, వైద్య సిబ్బందిని నియమించి ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా వైద్య సేవలు అందించేందుకు అధునాతన వైద్య పరికరాలు,అవసరమైన మందులు ఇతర సౌకర్యాలను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలల్లో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, త్రాగునీరు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు,ప్రహరీగోడ, అదనపు గదులు, వంటశాల,భోజనశాల ఇతర అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల-కళాశాల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత విద్యార్థులకు విద్యను మరింత అందుబాటులో తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రద్ధా డీ-అడిక్షన్ సెంటర్ & రిహాబిలిటేషన్



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 3:** నల్గొండ జిల్లాకు చెందిన 33 సంవత్సరాల పాండు నాయక్ అనే రోగి మరణించిన సంఘటన నేపథ్యంలో వచ్చిన వార్తల ఆధారంగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఉమా గౌరీ మరియు జిల్లా మహిళా అభివృద్ధి మరియు బాలల సంక్షేమ శాఖలకు చెందిన అధికారుల బృందం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని పర్వతాపూర్, మేడిపల్లి (వి %ఁ% ఎం), మల్లికార్జున నగర్లోని డోర్ నం. 1-83 వద్ద ఉన్న శ్రద్ధా డీ-అడిక్షన్ సెంటర్ %ఁ% రిహాబిలిటేషన్ సెంటర్ను తనిఖీ చేసింది.

ఈ కేంద్రాన్ని అనుమతులు లేకుండా శ్రీ మధు కుమార్ కొర్లపాటి నిర్వహిస్తున్నట్లు తేలింది. ఇతనికి ఎటువంటి వైద్య అర్హతలు లేవు. తనిఖీలో ఈ కేంద్రం అవసరమైన అనుమతులు లేకుండా నడుస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు.

తనిఖీ సమయంలో కేంద్రంలో మొత్తం 17 మంది రోగులకు అనధికార వ్యక్తులచే చికిత్స జరుగుతున్నట్లు గుర్తించారు. వెంటనే వారి తల్లిదండ్రులు/సంరక్షకులను సంప్రదించి, రోగులను వారికి అప్పగించారు. అందులో ఇద్దరిని వారి కుటుంబ సభ్యుల సమ్మతితో ఇతర అనుమతిప్రాప్త కేంద్రాలకు తరలించారు.



అర్హత కలిగిన వైద్యులు ఉన్నారని తప్పుడు ప్రచారం చేస్తూ, వ్యసనం, మానసిక ఆరోగ్య సమస్యలు లేదా శారీరక గాయాల నుండి కోలుకోవడానికి పేషెంట్లకు మందులు, ఇంజెక్షన్లు ఇవ్వడం ద్వారా బెడ్లతో కూడిన సౌకర్యంలో చికిత్స అందిస్తున్నట్లు గుర్తించారు. ఇది అనధికారికంగా క్లినిక్/ఆసుపత్రిగా నడుస్తోంది.

.ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ రూల్స్, 2013లోని రూల్ 8(2)(9) (%+.ా.వీ.ా%. నం.129, తేదీ: 08.08.2013)

లి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టంలోని సెక్షన్లు 9, 11, 12(2) ఉల్లంఘించి, రిజిస్ట్రేషన్ లేకుండా డీ-అడిక్షన్ సెంటర్ నడపడం, అర్హత కలిగిన వైద్య నిపుణులు లేకపోవడం, అలాగే శిక్షణ పొందిన డాక్టర్లు లేదా నర్సింగ్/పారామెడికల్ సిబ్బంది లేకుండానే ఈ కేంద్రం నిర్వహించడం జరిగింది.

పై వాస్తవాల ఆధారంగా, అనధికార మరియు చట్టవిరుద్ధ వైద్య పద్ధతుల వల్ల ప్రజా ఆరోగ్యానికి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు, శ్రద్ధా డీ-అడిక్షన్ సెంటర్ %ఁ% రిహాబిలిటేషన్ సెంటర్ను, శ్రీ మధు కుమార్ కొర్లపాటి నిర్వహణలో ఉన్న ప్రాంగణాన్ని తక్షణమే సీజ్ చేయడం జరిగింది.

ప్రజలు ఇలాంటి అనధికారిక కేంద్రాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అర్హత కలిగిన వైద్యులు మరియు రిజిస్టర్డ్ సంస్థలను మాత్రమే ఆశ్రయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఉమా గౌరీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (కీసర డివిజన్) డా. సత్యవతి, జిల్లా మహిళా అభివృద్ధి మరియు బాలల సంక్షేమ శాఖ సీడీపిఒ స్వాతి, సూపర్వైజర్ వెంకటేశ్వర రెడ్డి , సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు సిద్ధం

## నీట్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టరు గౌతం



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 3:** నీట్ పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులకు సులువుగా తెలిసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం తెలిపారు.

శనివారం కూకట్ పల్లిలోని జెఎన్ టియు కాలేజీలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టరు గౌతం తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులకు సులువుగా తెలిసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ప్రతి పరీక్షా హాలులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు పార్కింగ్ కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలించి ఎగ్జామ్ సెంటర్లోకి పంపాలన్నారు. మెడికల్ కిట్లు, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైన ఏర్పాట్లన్ని సజావుగా పూర్తి చేసారా అని కలెక్టరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్ టియు వైస్ ప్రిన్సిపల్ పద్మజ. అధికారులు, ఆర్డీవో శ్యాంప్రకాష్ పోలీసు అధికారులు, పరీక్షా కేంద్రాలకు డ్యూటీ మేజిస్ట్రేట్లుగా నియమించిన కూకట్ పల్లి, దుండిగల్, బాలానగర్, మూడుచింతలపల్లి, ఘట్కేసర్ , మల్కాజిగిరి తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం.

## వేములవాడ ఏరియా ఆసుపత్రి సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం రోజున వేములవాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆస్పత్రి ఆవరణలో ప్రభుత్వ విప్ మొక్కను నాటారు. ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య వివరాలు, ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల గౌరవంగా ఉండాలని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్యశ్రీని 10 లక్షల రూపాయల పెంచడం జరిగిందని తెలిపారు. మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా, ఎల్ఓసిల ద్వారా ఇప్పటివరకు 20 కోట్ల పైచిలుకు మంజూరు చేయించడం జరిగింది అని తెలిపారు.

ప్రాంతీయ ఆసుపత్రి ఎంట్రన్స్ లో రోగులకు ఒక చక్కటి హాల్లాదకరమైన వాతావరణం ఏర్పడేలా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ఓపి పేషంట్ల కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రికి వచ్చే వారికి కూర్చునేందుకు విలువ సరిపడ కుర్చీలను వేయాలని పేర్కొన్నారు. వేసవికాలంను దృష్టిలో ఉంచుకొని, ఫ్యాన్లు అమర్చాలని పేర్కొన్నారు

ఆసుపత్రిలో సరిపడా వైద్య సిబ్బందిని నియమించడానికి ప్రభుత్వంతో మాట్లాడుతానని పేర్కొన్నారు. మోకాళ్ళ సర్జరీని ఆస్పత్రిలో విజయవంతంగా పూర్తి చేయడం పట్ల వైద్యులను ఆయన అభినందించారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వైద్య సేవలు అందించాలని తెలిపారు.

ఈ సమావేశాలలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో చేరిన జయవరం గ్రామంలోని వివిధ పార్టీల కార్యకర్తలు.

## కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ప్రభుత్వ విప్.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి శనివారం రోజున వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామంలో ని వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది.

దేశవ్యాప్తంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని గమనిస్తూ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగిందని ఆది శ్రీనివాస్ అన్నారు.

కాంగ్రెస్ పార్టీ ద్వారా పేద ప్రజలకు సేవ చేయాలని పార్టీలో చేరుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.

నేటి నుంచి పార్టీలో చేరిన కొత్త కార్యకర్తల యోగక్షేమాలు కాంగ్రెస్ పార్టీ చూస్తుందని ఆయన అన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలు ప్రజలకు చేరవేయాలి అన్నారు.

బలహీన వర్గాలకు కుల గణన జరపాలని రాహుల్ గాంధీ ఇచ్చిన సూచన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కుల గణన చేసి దేశానికి ఒక రోల్ మోడల్ గా నిలిచారన్నారు.

బీసీలకు రాజకీయంగా, విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్లు అమలు చేయాలని అసెంబ్లీలో చట్టాన్ని చేయడం జరిగిందని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి పెంచే విధంగా ముఖ్యమంత్రి స్వయంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నాలో కూర్చున్నారని గుర్తు చేశారు.

కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి మంత్రివర్గ సమావేశంలో ఆమోదింపజేసి దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని ప్రకటించారని తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయమని ఆయన పేర్కొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు.

శుక్రవారం రోజున నాగారం గ్రామానికి వెళ్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని తెలిపారు.

చివరి గింజ వరకు ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం కంటే ఎన్నో రేట్లు వేగవంతంగా వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు.

శుక్రవారం రోజున ఇతర పార్టీ నాయకులు రోడ్డు ఎక్కి ధర్నా చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

సిరిసిల్ల జిల్లాలో గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం హయాంలో యాసంగి మే 01 నాటికి 2021-22 లో233 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు జరిగిందని తెలిపారు.

2022-23 లో9 వేల 424 మెట్టు టన్నులను గత ప్రభుత్వం కొనుగోలు చేసింది అని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత2023-24 లో67 వేల520 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసింది అని తెలిపారు. ప్రస్తుత సంవత్సరం02-05-2025 శుక్రవారం వరకు72 వేల 484 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు.

ఒక రైతు తో మాట్లాడితే గత ప్రభుత్వం రైతులను ఏ విధంగా మోసం చేశారో చెప్పారని తెలిపారు. తాలు పేరుతో రైతులను మోసం చేసి సంచికి 44 కిలోలు జోకి రైతులను నిలువున ముంచారని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమమే పరమావధిగా ముందుకు పోతున్నామని తెలిపారు.

## జిల్లాలో నీట్ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 03 :** జిల్లాలో నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నీట్ పరీక్ష నిర్వహణ కొరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల,రాజీవ్ నగర్ లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా,మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పరీక్ష నిర్వహణ కొరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల-మంచిర్యాల, తెలంగాణ ఆదర్శ పాఠశాల-రాజీవ్ నగర్, మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల,జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని,పరీక్షకు 1 వేయి 204 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల లోగా అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. కంట్రోల్ రూమ్, పరీక్ష కేంద్రాలలో సి.సి. కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల వద్ద 144,163 సెక్షన్లు అమలు చేయడం జరుగుతుందని, పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని తెలిపారు.తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాల రవాణా జరుగుతుందని, ఇందుకు గాను పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని,పరీక్ష రోజున ఉదయం 9 గంటల లోపు ప్రశ్నాపత్రాలు కంట్రోల్ రూమ్లో ఉంచాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రంలోనికి నిబంధనల ప్రకారం ఆభరణాలు,మొబైల్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం జరుగదని,ప్రతి అభ్యర్థిని పరిశీలించి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, మహిళా అభ్యర్థుల పరిశీలన కొరకు మహిళా సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు.పరీక్ష ముగిసిన తరువాత ఓ.ఎం.ఆర్. పత్రాల తరలింపు నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.4 పరీక్షా కేంద్రాలలో ఒక్కొక్క పరీక్షా కేంద్రానికి ఒక ముఖ్య పర్యవేక్షకుడు,పాలనా విభాగం నుండి ఒక నోడల్ అధికారి,పోలీసుశాఖ నుండి ఒక నోడల్ అధికారిని నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షా సమయంలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా, వైద్య-ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిని నియమించి,ఓ.ఆర్.ఎస్.అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని,పారిశుద్ధ్యం, త్రాగునీరు, దివ్యాంగుల కొరకు వీల్చైర్స్ ఇతర అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. పెన్ను, పెన్సిల్,ఎరేజర్, షార్ప్నర్, వైట్నర్ మొదలగు వాటిని అనుమతించడం జరగదని, అభ్యర్థులకు అవసరమైన పెన్నులను పరీక్షా కేంద్రంలోనే అందించడం జరుగుతుందని,ప్రతి అభ్యర్థి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నీట్ పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చక్రపాణి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో అత్యధిక మార్కులు సాధించిన జీవన్ ను సన్మానించిన ప్రభుత్వ విప్. ఆది.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ఏప్రిల్ నెలలో వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 585/600 మార్కులు సాధించిన వేములవాడ పట్టణం సుబ్రహ్మణ్య నగర్ కు చెందిన కనికరపు జీవన్ ను శనివారం రోజున వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తన క్యాంపు కార్యాలయంలో బోకే అందించి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ చదువులో ప్రతి విద్యార్థి రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, చదువును కష్టంతో కాకుండా, ఇష్టంతో చదవాలని ఆయన విద్యార్థులకు ఉద్బోధించారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ పాల్గొన్నారు.

## డిప్లొమా కోర్సులలో ప్రవేశాల కొరకు దరఖాస్తుల స్వీకరణ

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 03:** విద్యా సంవత్సరంలో శ్రీమతి దుర్గాబాయి దేశ్ ముఖ్ మహిళ సాంకేతిక శిక్షణ సంస్థ- హైదరాబాద్లో డిప్లొమా కోర్సులలో ప్రవేశం కొరకు అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన/నిరుపేద కుటుంబాలకు చెందిన / అణిచివేతకు గురైన/ఇతర బాధిత బాలికలు సి.సి.ఐ.లో నివసిస్తున్న బాలికల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్,డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ %ు% ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్,డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ %ు% కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాలలో ఒక్కొక్క విభాగంలో కేటాయించబడిన 60 సీట్లలో 70 శాతంతో 42 సీట్లు రిజర్వేషన్ కల్పించడం జరిగిందని, ఎస్.ఎస్.సి. ఉత్తీర్ణులై ఆర్ఫన్ / సెమీ ఆర్ఫన్ / బి.పి.ఎల్./ డిస్టిట్యూట్/ విక్టిమ్స్ ఆఫ్ ట్రాఫికింగ్ ఇన్మేట్స్ ఆఫ్ హోమ్స్/ ఉమెన్ ఇన్స్టిట్యూషన్స్ వారికి రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపారు. ఆయా విభాగాలలో ప్రవేశం కొరకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా బాలల సంరక్షణ విభాగం - బాలరక్షా భవన్లో సంప్రదించాలని, వివరాలకు 9908541697, 9441506519 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## అర్హులైన లబ్దిదారులకు రేషన్ కార్డు జారీ

## జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి 03 :** రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని,దరఖాస్తుదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్దిదారులకు రేషన్ కార్డు జారీ చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు.గతంలో పెండింగ్ లో ఉన్న నూతన రేషన్ కార్డులు,కార్డులలో సభ్యులను చేర్చడంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తులను సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారిని ఎంపిక చేసి జిల్లాలో 956 నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.రేషన్ కార్డులలో పిల్లలను చేర్పించుట,ఇతర మార్పులకు సంబంధించి 29 వేల 237 దరఖాస్తులు విచారించి ఆమోదించడం జరిగిందని తెలిపారు.రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని,ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, మీ-సేవలో దరఖాస్తు చేసుకోవచ్చని,అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్దిదారుల ఎంపికకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకున్నారు



**అమీర్పేట్ (ప్రజాబలం ప్రతినిధి)** మే 3 అమీర్ పేట డివిజన్ లోని ఎస్సార్ నగర్ లో గల శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకున్నారు. ఆలయ 30 వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో నిర్వహించిన పూజలలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. పూజల అనంతరం ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డు కుమార్, ఈ వో నరేందర్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, గుడిగె శ్రీనివాస్ యాదవ్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ధ్రువపత్రాలతో 8 లక్షలు రూపాయలు రుణం పొందిన కేసులో భార్యాభర్త అరెస్టు

## ఇద్దరికీ 14 రోజుల రిమాండ్ విధించిన బద్వేల్ కోర్టు

బద్వేలు 2023 వ సంవత్సరం అక్టోబర్ నెలలో బద్వేల్ నియోజకవర్గం బి కోడూరు మండలం మున్నెల్లి పంచాయతీ, గోవిందాయపల్లె హైస్కూల్ కు చెందిన సర్వేనెంబర్ 755 లోని 4.27 ఎకరాల భూమిని అక్రమంగా తమ పేరిట పాసుబుక్కుల్లో ఎక్కించుకొని రెవెన్యూ వారి ద్వారా ఆన్లైన్ లో ఎక్కించుకొని సదరు తప్పుడు ధ్రువపత్రాల ఆధారంగా బి. కోడూరు సొసైటీ బ్యాంకులో 8 లక్షల రూపాయల రుణం తీసుకున్న విషయమై, ఈ సంవత్సరం అనగా ఫిబ్రవరి 4వ తేదీన అప్పటి బి.కోడూరు తాసిల్దారు మధు నాయక్ బి.కోడూరు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కొండ వెంకటసుబ్బమ్మపై ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, సమగ్రంగా విచారించి, పాస్ పుస్తకాలను టైటిల్ డీడ్ ను ఫోర్జరీ చేసి రెవెన్యూ వారి ఆన్లైన్ నమోదు చేసుకుని సదరు ఫోర్జరీ పత్రాలను సొసైటీ బ్యాంకులో తనఖా పెట్టి 2024 సం., మార్చి నెలలో ఎనిమిది లక్షలు రుణము తీసుకున్న విషయం నిర్ధారణ కావడంతో అందుకు పాల్పడిన బి.కోడూరు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కొండ వెంకటసుబ్బమ్మ ఆమె భర్త వెంకటసుబ్బారెడ్డి లను వారి ఇంటి వద్ద అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం బద్వేలు కోర్టులో హాజరు పరచగా, కోర్టు వారు ఇద్దరికీ 14 రోజుల రిమాండు విధించిన

# నేడే నీట్ పరీక్ష



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 3:** నీట్ పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, నీట్ పరీక్ష మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరుగుతుందని, ఈ పరీక్షకు జిల్లా నుండి 4 వేల 336 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. అభ్యర్థులను ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, మధ్యాహ్నం 1.30 గంటలకు గేట్లు మూసివేయడం జరుగుతుందని, అభ్యర్థులు ఇట్టి విషయాన్ని గమనించి, నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టరు సూచించారు. అభ్యర్థులు చివరి నిమిషయంలో కంగారు పడకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లో ఉన్న నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టరు తెలిపారు.

# రైతుల వద్దకు శాస్త్రవేత్తలు


**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 3:** వానకాలంకు అన్నదాత లను సమయాత్తం చేసేందుకు వ్యవసాయ శాఖ కార్యచరణ రూపొందించింది ఈ కార్యక్రమంలో ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరుతో ఈనెల 5వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు ఇప్పటికే రైతులు వానకాలం సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు.నకిలీ విత్తనాల బారిన పడటం ప్రతిసారి వేసిన పంటలను మళ్లీమళ్లీ వేయడం అధిక దిగుబడులు సాధనకు మోతాదుకు మించిన ఎరువులు వినియోగంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో రైతుల నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా చైతన్యం చేయనుంది. సీజన్ సమయంలో రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వెళ్లడంతో చాలా సమస్యలకు పరిష్కార మార్గం లభించడం జరుగుతుందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. రైతు వేదికల ద్వారా ప్రతి వారం శాస్త్రవేత్తలతో ముచ్చటించే కార్యక్రమాలు కొనసాగుతున్న దూర భారంతో చాలా వరకు రైతులు అక్కడికి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు దీంతో ఆధునిక వ్యవసాయ శాస్త్ర పరిజ్ఞానం అందుతున్నది అంతంత మాత్రమే,జిల్లాలోని మేడ్చల్ ఘట్కేసర్ లో మే 5 నుంచి జూన్ 16 వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమము ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,ప్రతి గ్రామంలో రైతు వేదిక/గ్రామ పంచాయతీ నందు నిర్వహించడం జరుగుతుంది. అదేవిధంగా రైతు నమోదు కార్యక్రమం మే 5వ తారీకు నుంచి ప్రారంభమవుతుంది. ఇట్టి కార్యక్రమంలో ప్రతి రైతు కేంద్ర ప్రభుత్వం ఆధారిత పథకాల లబ్ధికోసం తన యొక్క పట్టా పాస్ పుస్తకము ఆధార్ కార్డు తో మరియు ఆధార్ కార్డుకు లింకు ఉన్నటువంటి ఫోన్ తో వచ్చి మీసేవ ద్వారా గాని లేదా వ్యవసాయ శాఖ అధికారి వద్ద గాని రైతు నమోదు కార్యక్రమం చేపించుకోవాల్సిందిగా తెలియజేస్తున్నాము.

# నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం తెల్లవారుజామున నూతన గృహప్రవేశం చేశారు..



**నకిరేకల్ ప్రజాబలం ప్రతినిధి:** వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ఈ తెల్లవారుజామున కుటుంబ సమేతంగా నూతన గృహ ప్రవేశం చేశారు, అనంతరం హెూమం, సత్యనారాయణ స్వామి వ్రతం పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు....

తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ , తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గౌరవగుత్తా సుఖేందర్ రెడ్డి , భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ,ఎంఆర్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ , ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి , కవ్వంపల్లి సత్యనారాయణ , శాసనమండలి డిప్యూటీ మాజీ చ్కెర్మన్ నేతి విద్యాసాగర్, పలువురు రాజకీయ నేతలు, నాయకులు తదితరులు హజరై ఎమ్మెల్యే కి శుభాకాంక్షలు తెలియజేశారు...



# గడ్డం శ్రీనివాస్ యాదవ్ ను ఘనంగా సన్మానించిన భేరి రామచంద్ర యాదవ్, బిల్డర్ ప్రసాద్ యాదవ్, అందేలా కుమార్ యాదవ్



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్గా గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన బిసి ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్

రెజ్లింగ్ క్రీడాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హైదరాబాద్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ఫతేమైదాన్ క్లబ్ లో గడ్డం శ్రీనివాస్ యాదవ్ ను అసోసియేషన్ నాయకులు అసోసియేషన్ ఛైర్మెన్ గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగాసన్మానించారు. అనంతరం గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగాల్లో రెజ్లింగ్ క్రీడాకారుల కోటాను నిషేదించారని... దానిని పునరుద్ధరించాలని కోరారు. రెజరర్లు శరీరకాంగ దృఢంగా ఉంటారని... పోలీస్ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. అలాగే రెజరర్లు పోటీలలో పాల్గొనడం వల్ల చదువుల్లో వెనుకబడుతున్నారని... అటెండెన్స్ లేని కారణంగా వారిని ఎగ్జామ్స్ రాయించడానికి కూడా అనుమతించడం లేదని తెలిపారు. వారికి అటెండెన్స్ లో మినహాయింపు ఇవ్వాలని... అలాగే యువ రెజరర్లకు ఉన్నత చదువులు చదవడానికి తన వంతు సహకారం అందిస్తామని గడ్డం శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.ఈ సందర్భంగా భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ గడ్డం శ్రీనివాస్ యాదవ్ చాలా మంచి నాయకత్వం లక్షణాలున్న మనిషన్నారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ అసోసియేషన్ చైర్మన్గా నియమాతులైనందుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మంచి పోరాటపటిమ గల వ్యక్తిని ఎన్నుకున్నారని ఆయన రెజ్లింగ్ క్రీడాకారుల పట్ల అంకితభావంతో పనిచేసి వారికి తగిన విధంగా కృషి చేస్తారని ఆశిస్తున్నానని అన్నారు గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారులను ప్రోత్సహించాలి కుస్తీ పోటీ ఆసక్తి గల యువతి యువకులకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి వారికి కోచింగ్ సమయంలో దాదాపు నెలకు వేలు ఖర్చు వస్తుంది ప్రభుత్వం పూర్తిగా మద్దతు తెలిపాలి కుస్తీ పోటీ క్రీడాకారులకు ప్రభుత్వం విద్యా ఉద్యోగ లో అవకాశాలు కల్పించాలి అని అన్నారు జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి రాష్ట్రస్థాయి జాతీయస్థాయి లెవెల్లో ఈ క్రీడాన్ని ప్రభుత్వాలు ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిసి ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి సంతోష్ యాదవ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శైలేంద్ర సింగ్, వైస్ ప్రెసిడెంట్ కిరణ్ యాదవ్,వైస్ చైర్మన్ షేక్ సలాం బిన్ అబ్దుల్లా, జనరల్ సెక్రటరీ నజీర్ కుల్లాకి, ట్రెజరర్ ఖాలెద్ బామస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మహ్మద్ అస్లాం జాయింట్ సెక్రటరీ లింగం తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులకు చట్టబద్ధతపై అవగాహన



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 3 మే 2025** మణికొండ భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు స్థానిక వీధి వ్యాపారస్తులతో చిట్ చాట్ చేస్తూ వారికి వీధి వ్యాపారుల చట్టం గురించి పూర్తి అవగాహన కల్పిస్తూ చట్ట భద్రతతో కలిగే వారి హక్కుల గురించి తెలియ జేస్తూ అందుకు గాను ప్రభుత్వల ద్వారా వీధి వ్యాపారుల బ్రతుకు దెరువు భద్రత కల్పించడం చట్టబద్ధత కల్పించడం అన్నీ వివరముగా కూలకంశంగా తెలియ పరచిన సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, సంగం శ్రీకాంత్, యాలాల కిరణ్, జై రామ్, భాను చందర్, సుమనళిని, బెన్నీ, షేక్ ఆరిఫ్, చెరుకూరి బాలాజీ, ఎస్.రేఖ, అశ్వక్ అలీ, ఆరిఫ్మహమ్మద్, ప్రవీణ్ తది తరులు.

# రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దక్షిణ కాశిగా ప్రసిద్ధి పొందిన ప్రముఖ శివ క్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి శనివారం రోజున భక్తులు పోటెత్తినారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలోని విద్యాసంస్థలకు సెలవులు రావడంతో భక్తులు కుటుంబ సభ్యులతో వచ్చి ఆలయ ధర్మగుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి, శివునికి ప్రీతికరమైన కోడె మొక్కులను చెల్లించుకుని, అనంతరం స్వామి వారిని దర్శించుకుని తమ తమ మొక్కలు చెల్లించుకున్నారు. పరివార దేవతలను దర్శించుకుని, భక్తులు వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించారు.భక్తుల రద్దీతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారినాయి. పలువురు భక్తులు బంగారం( బెల్లం) రాజరాజేశ్వర స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షణ చేశారు. శనివారం రోజున సుమారుగా 30 వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భీమేశ్వర స్వామి, బద్ది పోచమ్మ ఆలయాలను భక్తులు సందర్శించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

# యక్షగాన రంగస్థల కళలను కాపాడుకోవాలి. రాష్ట్ర కన్వీనర్ యెల్లా. పోశెట్టి.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, చందుర్తి, ( ప్రజాబలం ),** తేదీ 02-05-2025 శుక్రవారం రాత్రి 9 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లోని నర్సింగాపూర్ గ్రామం నందు నటరాజ కళామండలి ఆధ్వర్యంలో చిరుతల రామాయణం నాటక ప్రదర్శన కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎల్లా పోశెట్టి, రాజన్న సిరిసిల్ల ఉద్యమ కళాకారుల జిల్లా అధ్యక్షులు కనకయ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా మహాభారత రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు, కార్యదర్శులు చందుర్తి మండల కళాకారుల విభాగం అధ్యక్షులు, కార్యదర్శులు నర్సింగాపూర్ గ్రామపుర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, మండలి అధ్యక్షులు, కార్యదర్శులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించడం జరిగింది. అనంతరం కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎల్ల పోశెట్టి మాట్లాడుతూ మరుగున పడిపోతున్న జానపద గాన వివిధ కళారూపాలను వెలికి తీయా లనే సంకల్పంతో నర్సింగాపూర్ గ్రామం తో పాటు ఇతర గ్రామ దాతల సహకారంతో గత మూడు రోజులపాటు చిరుతల రామాయణం నాటక కళా ప్రదర్శనను ఏర్పాటు చేసిన పెద్దలందరికీ, కళాకారుల రాష్ట్ర కమిటీ తరఫున హృదయపూర్వక కళాభివందనాలు తెలియజేశారు. వృద్ధాప్యంలో ఉన్న కళాకారులు అందరికీ వృద్ధాప్య పింఛన్లను మంజూరు చేయాలని, కళాకారులు అందరికీ ప్రభుత్వం గుర్తింపు కార్డులను అందజేయాలని, అలాగే యక్షగాన కళామండలికి వాయిద్య పరికరాలతో పాటు, మైక్ సౌండ్ సిస్టంలను అందజేసి కళామండలని ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందులో పాత్రధారులు శ్రీరాముడు- బొడ్డు రాములు, రావణుడు- శ్రావణపల్లి శ్రీనివాస్, లక్ష్మణుడు- నేలకొండ అనంతరెడ్డి, దశరథ మహారాజు - గిరి రాజారాం, సీత- శ్రీరాముల శ్రీనివాస్, భరతుడు- ఎడ్ల కుశాల్, తాటకి - పల్లి రవి, అహల్య - ఎర్రం దేవయ్య, వ్యాఖ్యాత - రెడ్డి వెంకట్ రెడ్డి, కళాకారులు లక్ష్మణ్, నారాయణరెడ్డి, మర్రి మల్లేశం, ఇన్నారపు శ్రీనివాస్, దొంగరి లక్ష్మీరాజం, గంగయ్య, తిరుపతి, చిన్నయ్య తో పాటు 30 మంది కళాకారులు, కలలకు జీవం పోశారని ఆయన తెలియజేశారు.

# బంజారాహిల్స్ కబ్జా కు గురైన స్థలం స్వాధీనం

## మంత్రి పొన్నం ప్రభాకర్





**జూబ్లీహిల్స్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయం ముందు కబ్జా కు గురై తిరిగి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ , కలెక్టర్ అనుదీప్ దురశెట్టి ,ఆర్డీవో ,ఎమ్మార్వో తదితర అధికారులు

సర్వే నెంబర్ 102/1హెచ్ఏకె/1 లో 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్నీ పరిశీలించి పెన్సింగ్ పై అధికారులకు పలు సూచనలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ స్థలం విలువ సూమారుగా 1200కోట్లు ఉంటుందని అంచనా.

12 ఎకరాల ప్రభుత్వ స్థలంలో కబ్జా కు గురైన ప్రాంతంలో కూల్చివేసిన ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు..

మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయం ముందు 102/1 సర్వ్ నెంబర్ లో ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలం కబ్జా కి గురికావడంతో కలెక్టర్ ,ఆర్డీవో ఎమ్మార్వో తదితర అధికారులు రికార్డుల ఆధారంగా రెవెన్యూ అధీనంలోకి తీసుకోవడం జరిగింది దీనిని ప్రజలకు ఉపయోగపడే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నిర్ణయం చేశారు ప్రభుత్వ స్థలాన్ని కాపాడిన కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో కి హైదరాబాద్ ఇన్చార్జి మంత్రిగా అభినందనలు తెలిపారు.

ధరణి తరువాత భూ భారతి వచ్చిన సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు కబ్జా కు గురైనట్లయితే ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పాకిస్తాన్ తో వాణిజ్యం రద్దు చేసుకున్న భారత్




పాకిస్తాన్ తో భారత్ పూర్తిగా వాణిజ్యం రద్దు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఎగుమతులు, దిగుమతులను కూడా నిలిపివేసింది. ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులను నిలిపివేస్తూ భారత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం కూడా తక్షణమే అమల్లోకి అనున్నట్లు అధికారులు తెలిపారు. అడ్డదారిలో పాక్ వస్తువులు దేశంలోకి రాకుండా పరోక్ష దిగుమతులను కూడా కేంద్రం బ్యాన్ చేసింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ ఈ నిర్ణయాలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే.

## శిల్పా లే ఔట్ ఫ్లై ఓవర్ పనులను పరిశీలించిన కమిషనర్ ఆర్ వి కర్ణన్.



**శేరిలింగం పల్లిప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ మే03 శేరిలింగం పల్లి జోన్ మల్కం చెరువు, గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు చేపట్టిన రెండో దశ శిల్పా లే ఔట్ ఫ్లై ఓవర్ పనులను పరిశీలించిన కమిషనర్ ఆర్ వి కర్ణన్.

హెచ్ సిటి ప్రాజెక్ట్ ద్వారా ఖజాగూడ చౌరస్తా వద్ద చేపట్టనున్న ఫ్లై ఓవర్ అండర్ పాస్ స్తల పరిశీలన చేసిన కమిషనర్

మల్కం చెరువు లో శానిటేషన్, కుక్కల బెడద, పై కమిషనర్ కు పిర్యాదు చేసిన వాకర్స్

వాకర్స్ ఇబ్బంది లేకుండా నిర్వాహకులు తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించిన కమిషనర్.



చెరువు లో స్టార్మ్ డ్రైన్ వాటర్ ఎక్కడ నుండి వస్తుందని అధికారులను అడిగిన కమిషనర్

దుర్గం చెరువు నుండి , ఇళ్లనుండి స్టార్మ్ వాటర్ వస్తున్నట్లు కమిషనర్ కు వివరించిన అధికారులు . స్టార్మ్ వాటర్ చెరువులో రాకుండా ప చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు.

శిల్పా లే ఔట్ రెండో ఫేస్ ఫ్లై ఓవర్ పనులను పరిశీలించిన కమిషనర్.

ఫ్లై ఓవర్ పనులను ఈ నెల చివరికి పూర్తిచేయాలని ఆదేశించిన కమిషనర్

భూసేకరణ పూర్తిచేస్తే సర్వీస్ రోడ్డు కూడా పూర్తవుతుందని కమిషనర్ ను తెలిపిన ప్రాజెక్టు ఇంజనీర్లు.

భూసేకరణ పక్రియ పూర్తికి చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్ కు ఆదేశాలు.

కమిషనర్ వెంట జోనల్ కమీషనర్ బి హేమంత్ సహదేవ్ రావు, డి సి ప్రశాంతి యస్ ఈ బాలాజీ, ప్రాజెక్టు ఈ ఈ నమ్యనాయకి, డి ఈ ఈ హరీష్ యు బి డీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ పైన చేపట్టే పనులను నడిచి వెళ్లి పరిశీలించిన కమిషనర్

## మా మొర ఆలకించండి బస్సులు నిలపండి

### సర్వీసు రోడ్ లో రిక్వెస్ట్ స్టాప్ కోసం ఎదురుచూపులు

### పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 3 (ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం లోని అల్లాదుర్గ్ మండల పరిధిలో గల రాంపూర్ చౌరస్తాలో రిక్వెస్ట్ స్టాప్ కోసం ఆరు గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు, పల్లె ప్రజలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు అందాలని, అధికారులు పదేపదే చెబుతున్న, ఆ దిశగా అడుగులు పడటం లేదు, తమకు బస్సు సేవలను చేరువ చేయాలని విజ్ఞప్తులు చేస్తున్న పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు, జాతీయ రహదారి నిర్మాణంతో ఇక్కడ బస్సులు ఆగకుండా పోతున్నాయని, అల్లాదుర్గం మండలం రాంపూర్ చౌరస్తా పరిధిలోని ఆరు గ్రామాల ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, సర్వీసు రోడ్డు మీదుగా బస్సులు రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకోవాలని, గత నెలలో రాంపూర్ గ్రామస్తులు నారాయణఖేడ్ డిపో మేనేజర్ కి వినతిపత్రం అందజేశారు, డిపో మేనేజర్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపిన ఇంతవరకు ఎలాంటి మార్పు రాలేదని గ్రామస్తులు చెబుతున్నారు, ఇక్కడ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేస్తే, రాంపూర్,తో పాటు సీతా నగర్, సీతానగర్ తండా, కాయిదంపల్లి, నీలకంఠపల్లి, గ్రామాల ప్రజలకు ఆర్టీసీ సేవలు చేరువవుతాయని ఇకనైనా అధికారులు పట్టించుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున డిపోను ముట్టడిస్తామని ఆయా గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారు.....

## లక్ష్మీ సాగర్ వాసికి ఓయూ డాక్టరేట్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 3 (ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం లోని,పుల్కల్ మండలం లక్ష్మీ సాగర్ లాల్ సింగ్ తండా, వాసి రామావత్ ప్రకాష్ కు, ఓయూ డాక్టరేట్ వరించింది, ఆయన ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల సీనియర్ ప్రొఫెసర్, డిన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్, పాలమూరు యూనివర్సిటీ, మాజీ వైస్ ఛాన్సలర్, లక్ష్మీకాంత్ రాథోడ్, వారి పర్యవేక్షణలో ఎలైట్ మేల్ కోకో ప్లేయర్స్ మోటర్ ఎబిలిటీ, ఫ్లయింగ్ ఎబిలిటీస్ పై సర్క్యూట్ ట్రైనింగ్ – స్పీడ్ ట్రైనింగ్ ప్రభావం, అనే అంశంపై పరిశోధన చేసి, పీహెచ్డీ పూర్తి చేసినందుకు, ఆయనకు ఓయూ డాక్టరేట్ ప్రధానం చేశారు, ఈ తండాలో ఒక మారుమూల నిరుపేద గిరిజన కుటుంబంలో కీర్తిశేషులు రామవత్ ఏరియా నాయక్, రిక్కీ బాయిల 5వ సంతానం జీవితంలో అనేక కష్టనష్టాలను అవమానాలను ఎదుర్కొని ఈ ప్రాంతం నుంచి ఉన్నత విద్య అభ్యాసం చేయాలని పట్టుదలతో తన చిరకాల ఆకాంక్ష క్రీడారంగంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించి, ఓయూ డాక్టర్ కలనీ సహకారం చేసుకున్నారు, డాక్టర్ ప్రకాష్ ఓయూ డాక్టరేట్ అందుకోవడం పట్ల, యూనివర్సిటీ ఆచార్యులు, కళాశాల లెక్చరర్, గ్రామ ప్రజలు, బంధువులు మిత్రులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు...

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com